



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 12 సంచిక : 271 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 5 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :271 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 5 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## చంద్రబాబు అధ్యక్షతన ఎన్డీయే సమావేశం...
## హాజరైన పవన్ కల్యాణ్, మాధవ్

- ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశం
- హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- రెండేళ్ల కూటమి ప్రభుత్వ విజయాలపై వేడుకలకు సన్నాహాలు
- కార్యక్రమాల కార్యాచరణపై నేతల మధ్య కీలక చర్చ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై భాగస్వామ్య పక్షాల నేతలు దృష్టి సారించారు. గురువారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో కీలక నేతలు సమావేశమై దీనిపై చర్చించారు. ఈ భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో సాధించిన విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలనే దానిపై నేతలు ప్రధానంగా చర్చించారు. వేడుకల నిర్వహణకు సంబంధించిన కార్యాచరణ, భవిష్యత్ ప్రణాళికలపై సుదీర్ఘంగా సమాలోచనలు జరిపారు. ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించేలా

- మిగతా 2లో

# ఏపీ కేబినెట్ భేటీ.. 'అమరావతి ఐ' సహా
# కీలక ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం
- లండన్ ఐ తరహాలో అమరావతిలో 'అమరావతి ఐ' నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 125 రోజులకు పెంచుతూ కీలక నిర్ణయం
- రాష్ట్రానికి కొత్త విమానయాన పాలసీ, పర్యాటకాన్ని పెంచేలా బీచ్ షాక్‌ల ఏర్పాటు
- అగ్రిగోల్డ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కోర్టుకు సిబ్బంది నియామకం, సబ్ కమిటీ ఏర్పాటు
- పోలవరం ఎడమ కాలువకు సవరించిన అంచనాలు, పలు పారిశ్రామిక ప్రాజెక్టులకు భూకేటాయింపులు



పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గ సమావేశం, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేసే పలు చారిత్రాత్మక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చే 'అమరావతి ఐ' ప్రాజెక్టు నుంచి గ్రామీణ పేదల బతుకులకు భరోసా ఇచ్చే కొత్త ఉపాధి హామీ పథకం వరకు దాదాపు 35కు పైగా కీలక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి ఆమోదముద్ర వేసింది. సమావేశం అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను సమగ్రంగా వివరించారు.

**అమరావతికి ఐకానిక్‌గా 'అమరావతి ఐ'**

లండన్, దుబాయ్ నగరాల్లోని ఐకానిక్ నిర్మాణాల తరహాలో, కృష్ణా నది ఒడ్డున ఆరు ఎకరాల విస్తీర్ణంలో 'అమరావతి ఐ' నిర్మాణానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో 30 ఏళ్ల లీజు ప్రాతిపదికన ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. దీనికోసం టెండర్లు ఆహ్వానించేందుకు మంత్రివర్గం అనుమతి ఇచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా అమరావతి, కృష్ణా నది అందాలను పర్యాటకులు వీక్షించేందుకు వీలు కలుగుతుందని, ఇది ప్రపంచ పర్యాటక

- మిగతా 2లో



## నేడు విశాఖకు సీఎం చంద్రబాబు...

### ఆక్వా ఎగుమతులపై జాతీయ వర్క్‌షాప్

- విశాఖ నగరంలో పర్యటించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- సీఫుడ్ ఎగుమతులపై జాతీయ సదస్సులో పాల్గొననున్న సీఎం
- కేంద్ర మంత్రులతో కలిసి వర్క్‌షాప్‌లో ప్రసంగించనున్న చంద్రబాబు
- పర్యావరణ దినోత్సవం సందర్భంగా సైకిల్ యాత్ర, మొక్కలు

పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం విశాఖపట్నంలో పర్యటించనున్నారు. సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమ తులపై నగరంలో

- మిగతా 2లో



## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు..

### ప్రాంతీయ పార్టీలతో కేంద్రం రహస్య సంప్రదింపులు!

- డీలిమిటేషన్ బిల్లుపై కేంద్రం మరోసారి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం
- 2029 ఎన్నికల లోపే పూర్తి చేయాలని యోచన
- ప్రాంతీయ పార్టీలతో కేంద్రం సంప్రదింపులు
- గతంలోని వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని ఆచితూచి అడుగులు
- ఏకాభిప్రాయం కోసం ముందస్తు చర్చలు

పెన్ పవర్ డెస్క్:నియోజకవర్గాల పునర్విభజన బిల్లును మరోసారి తెచ్చే యోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. 2029 లోక్‌సభ ఎన్నికల కంటే ముందే ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి కసరత్తు చేస్తోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే ఇది సున్నితమైన అంశం కావడంతో ఎలాంటి వివాదాలకు తావులేకుండా రాజకీయంగా ఏకాభిప్రాయం సాధించాలని ప్రభుత్వం

- మిగతా 2లో

# దమ్ముంటే నన్ను అరెస్ట్ చేయండి



- బియ్యం దొంగతనం చేశానని తనపై ఆరోపణలు చేస్తున్నారన్న పేర్ని నాని
- దమ్ముంటే విచారణ జరిపి జైల్లో పెట్టాలని సవాల్
- డీఎస్సీలో చేసిన పాపాలు చంద్రబాబును, మంత్రులను వదిలిపెట్టవని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో డీఎస్సీ, స్పోర్ట్స్ కోటా ఉద్యోగాల భర్తీ వ్యవహారం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ఈ అంశంపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు, మంత్రులు అనిత, కొల్లు రవీంద్రలను టార్గెట్ చేస్తూ తీవ్రస్థాయిలో

- మిగతా 2లో

## వైసీపీ మాజీ ఎమ్మెల్యే బెయిల్ పిటిషన్.. తెలంగాణ హైకోర్టు నోటీసులు

- భూకబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న బొల్లా బ్రహ్మనాయుడు
- హైదరాబాద్ నార్సింగి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు
- అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు



పెన్ పవర్ డెస్క్:దాదాపు రూ.1,500 కోట్ల విలువైన భూములను కబ్జా చేయడానికి ప్రయత్నించారనే తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముందస్తు బెయిల్ పిటిషన్ పై తెలంగాణ హైకోర్టులో కీలక విచారణ జరిగింది. ఈ ల్యాండ్ గ్రాబింగ్ వివాదంలో నార్సింగి పోలీసులు తనతో పాటు మరికొందరిపై నమోదు చేసిన కేసులో అరెస్ట్ కాకుండా ఉండేందుకు ఆయన ముందస్తుగా

- మిగతా 2లో



## ప్రకాశం జిల్లాలో తీవ్ర విషాదం...
## ఈతకు వెళ్లి నలుగురు చిన్నారుల మృతి

- బాలుర ప్రాణం తీసిన ఈత
- ఒంగోలు మండలం చెరువుకొమ్ముపాలెంలో ఘటన
- మృతుల్లో ఇద్దరు అన్నదమ్ములు
- వేసవి తాపం నుంచి సేద తీరేందుకు వెళ్లి దుర్ఘటన
- సంఘటనపై మంత్రి స్వామి దిగ్భ్రాంతి, విచారణకు ఆదేశం

పెన్ పవర్ డెస్క్:ఏపీలోని ప్రకాశం జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గురువారం నాడు ఒంగోలు మండలం పరిధిలోని చెరువుకొమ్ముపాలెం గ్రామంలో ఈతకు వెళ్లి నలుగురు చిన్నారులు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.వివరాల్లోకి వెళితే, మృతులను కర్రేటి అభిరామ్ (14), కర్రేటి సుశాంత్ (12), పొదిలి చిన్ను (11), ఇల్ల దినేష్ (10)గా గుర్తించారు. వీరిలో అభిరామ్,

- మిగతా 2లో



## పవన్ కల్యాణ్ భాష, తీరు సరిగా లేదు

- తెలంగాణ ఆవిర్భావ వేడుకల వేళ పవన్ ఇక్కడ సభ పెడతాననడం సరికాదన్న గుత్తా
- చంద్రబాబు, పవన్, మంత్రులు అమరావతిలో ఉండాని సూచన
- తెలంగాణతో పోలిస్తే ఏపీకే ఎక్కువ వనరులు ఉన్నాయని వ్యాఖ్య

- మిగతా 2లో

## ఆకాశమే హద్దుగా హైదరాబాద్..

### దక్షిణ భారత స్కైస్క్రేపర్ రాజధానిగా భాగ్యనగరం!

- ఆకాశహర్మ్యాల నిర్మాణంలో దూసుకెళ్తున్న హైదరాబాద్
- దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఎత్తైన భవనంగా నిలిచిన కోకాపేట 'శాస్ క్రౌన్'
- భారీగా పెరిగిన నిర్మాణ అనుమతులు
- ప్రభుత్వ విధానాలు, పెరిగిన భూముల ధరలే ఈ ట్రెండ్‌కు ప్రధాన కారణం
- విపరీతంగా పెరిగిన ఫ్లాట్ల ధరలు, నిర్వహణ ఛార్జీలతో కొనుగోలుదారులపై భారం



పెన్ పవర్ డెస్క్:ఒకప్పుడు చారిత్రక కట్టడాలకు, విశాలమైన భూభాగాలకు ప్రతీకగా నిలిచిన హైదరాబాద్ మహానగరం, ఇప్పుడు తన రూపురేఖలను పూర్తిగా మార్చుకుంటోంది. దేశంలోని ఇతర మహానగరాలకు దీటుగా, ఆకాశాన్ని తాకే భవనాలతో సరికొత్తగా ఆవిష్కృతమవుతోంది. ముఖ్యంగా నగరం యొక్క పశ్చిమ కారిడార్‌లో నిర్మాణ రంగం అపూర్వమైన రీతిలో నిలువుగా విస్తరిస్తోంది.

- మిగతా 2లో



## రేవంత్ పర్యటన విహారయాత్ర లాంటిది

- పాలమూరు-రంగారెడ్డి పథకంలో ప్రభుత్వ తీరుపై శ్రీనివాస్ గౌడ్ విమర్శలు
- కేసీఆర్ హయాంలోనే 80 నుంచి 90 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడి
- మిగిలిన పనులను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తోందని విమర్శ

- మిగతా 2లో

## పవన్ సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదు?

### తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామ్‌చందర్ రావు



- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని ఎద్దేవా
- ఎవరైనా, ఎక్కడైనా సభ పెట్టుకునే హక్కు ఉందని వ్యాఖ్య
- రాజకీయ పరిస్థితులను బట్టి తెలంగాణలో పొత్తు ఉంటుందని వివరణ
- జనసేనతో పొత్తుపై హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని వెల్లడి

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# నై.. నై.. రుతుపవనాలు

:దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిది. నైరుతి రుతుపవన కాలం.జూన్ 1వ తేదీ వచ్చింది అంటే చాలు, కేరళ తీరాన్ని వర్షాలు పలకరిస్తాయి. తద్వారా దేశవ్యాప్తంగా వ్యవసాయ పనులు ఊపందుకుంటాయని అందరూ ఆశిస్తారు. అయితే 2026 సీజన్‌లో నైరుతి రుతుపవనాల రాక కోసం కొంత జాప్యం చోటు చేసుకుంది. ముందుగా అంచనా వేసినట్టుగా జూన్ 1న ఇవి కేరళను తాకలేకపోయాయి. వాతావరణ పరిస్థితుల అనుకూలించకపోవడంతో ఇవి ప్రస్తుతం ఉన్నచోటే స్తబ్ధుగా నిలిచిపోయాయి. సాధారణంగా జూన్ 1వ తేదీ నాటికి కేరళ తీరాన్ని తాకాల్సిన రుతుపవనాలు, ఈ సారి ఆ లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమయ్యాయి. ప్రస్తుతం ఇవి మార్గమధ్యలో నిలిచిపోయాయని భారత్ వాతావరణ శాఖ, ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ ధ్రువీకరించాయి. రుతుపవనాల ద్రోణి కదలికలు మందగించడమే దీనికి ప్రధాన కారణం. పూర్తిగా వ్యవసాయిక దేశం అయిన భారత్ లో వర్షాలే ఆధారం. ఎంతలా అంటే దేశ జీడీపీని ప్రభావితం చేసేటంతలా. గ్రామీణ ప్రాంతాలు దేశంలో నూటికి డెబ్బై శాతం ఉన్నాయి. దాంతో దేశ జాతీయ స్థూల ఆదాయం వృద్ధి చెందాలీ అంటే గ్రామీణ భారతం పచ్చగా ఉండాలి. అది ఎపుడు సాధ్యపడుతుంది అంటే భారీగా సమాయనుకూలంగా వానలు పడి పంటలు పండినపుడు. దేశంలో ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1న మొదలవుతుంది. కానీ దేశంలో అగ్రికల్చర్ ఇయర్ మాత్రం జూన్ లో స్టార్ట్ అవుతుంది. దానికి కారణం నైరుతు రుతు పవనాల రాక. ఈ రుతు పవనాలు ఎంత తొందరగా వస్తే అంత సంబరంగా ఏరువాక స్టార్ట్ అవుతుంది. దాంతో రైతాంగం సైతం సంబరాలు చేసుకుంటుంది. కానీ ఈసారి పరిస్థితి చూస్తే నైరుతి నై నై అంటోంది: సకాలంలో నైరుతి రుతు పవనాలు దేశంలోకి ప్రవేశించడం అంటే మే నెలాఖరు అన్న మాట. ఈ మేరకు భారత వాతావరణ విభాగం ఐఎండీ అయితే మొదట చెప్పింది మే 26న నైరుతి దేశంలో ఎంట్రీ ఇస్తుందని. కానీ ఆ డేట్ తప్పింది. ఆ తరువాత మే 30, 31 తేదీలు అన్నా కూడా అదీ జరగలేదు. జూన్ 1 లేదా 3 అని చెప్పినా ఇపుడు ఆ డేటూ మారింది. లేటెస్ట్ డేట్ ఏంటి అంటే జూన్ 8 తరువాత అని అంటున్నారు. అయితే అది కూడా అంత కన్ ఫర్మ్ అవునా కాదా అన్నది ఒక పెద్ద డౌట్. మరో వైపు చూస్తే ఈసారి నైరుతి ఆగమనం లేట్ అయినా వానలు కూడా చాలా తక్కువ పడతాయని దానికి కారణం నైరుతి బలహీనంగా ఉందని. ఈ వార్తలు అయితే రైతాంగాన్ని కాదు దేశ ఆర్థిక నిపుణులను కూడా షాక్ కి గురి చేస్తున్నాయి. ఈసారి వానలు తక్కువ పడితే ఆ ప్రతికూల పరిస్థితి ఎలా ఉంటుంది అనే అంతా ఆలోచిస్తున్నారు. ఈసారి తేలిక పాటి వానలే పడతాయంటే వ్యవసాయం సంగతి ఏమిటి అన్నది కూడా మరో చింతగా మారుతోంది. భారత్ లో నైరుతి ఎంట్రీకి గేట్ వే కేరళం రాష్ట్రం. అక్కడ నుంచే మెల్లగా దేశంలోకి ప్రవేశించి మొత్తం దేశమంతా కొద్ది కాలంలోనే సర్దుకుని భారీ వానలు కురుస్తాయి. అలా వర్షాకాలం సీజన్ స్టార్ట్ అయి సెప్టెంబర్ నెలాఖరు వరకూ కొనసాగుతుంది. అయితే ప్రస్తుతం కేరళంలో కొన్ని ప్రంతాలలో వర్షాలు పడుతున్నాయి కానీ నైరుతి ఆరంభ సూచిన అది కాదని ఐఎండీ చెబుతోంది. నైరుతి రాకను గుర్తించాలంటే కొన్ని ప్రమాణాలు ఉన్నాయి. కేరళంలోని ఈ సీజన్ లో ఏకంగా అరవై శాతం పైగా వానలు పడితే నైరుతి ఎంటర్ అయినట్లుగా భావిస్తారు. అలాగే అరేబియా సముద్రం నుంచి పశ్చిమ దిశగా వీచే గాలులు ఆ నిర్దిష్ట వేగాన్ని అందుకోవాల్సి ఉంటుంది. ఆ మీదట ఆయా ప్రాంతమంతా తగినన్ని మేఘాలు విస్తరించి ఉండాలి. ఇవన్నీ నైరుతి రుతు పవనాల ఆగమాన్ని సూచిస్తాయి. ప్రస్తుతం అయితే కేరళం రాష్ట్రంలో కొన్ని చోట్ల వానలు పడుతున్నాయి. మేఘాలు విస్తరించి కూడా ఉన్నాయి. కానీ అసలైన ప్రమాణం అయిన అరేబియా సముద్రం నుంచి గాలులు వీయడం లేదని ఐఎండీ సైంటిస్టు చెబుతున్నారు . ఈ మూడు ఒకేసారి కలసి ఉంటేనే నైరుతి పవనాల సీజన్ స్టార్ట్ అయినట్లు. అపుడు వర్షాకాలం వచ్చినట్లుగా చెబుతారు. ఇక ఈసారి పూర్తి స్థాయి వానలు కురిసే అవకాశాలు కూడా తక్కువ అని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దానికి ఎల్ నినో ప్రభావం కారణం అని స్పష్టం చేస్తున్నారు. దాని వల్ల గత ఏడాది కంటే ఈసారి తక్కువ వానలు పడతాయని వాటితోనే సర్దుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. నైరుతి రుతు పవనాలు ఆలస్యమైనా లేదా ఎంట్రీ ఇచ్చినా బలహీనం కావడం వెనక ఎల్ నినో ప్రభావం గట్టిగా ఉంటుందని అంటున్నారు. ఈ విధంగా వర్షాభావ పరిస్థితులు కనుక ఉంటే ఇది దేశ ఆర్థిక వ్యవస్థ మీద కూడా పెను ప్రభావం చూపిస్తుందని అంటున్నారు.

ఈ జాప్యాన్ని ప్రధాన కారణం ఏంటంటే... అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో ఏర్పడిన పరిస్థితులే. ఈ రెండు కూడా రుతుపవనాల పురోగతికి ఆటంకం కలిగిస్తున్నాయి. పశ్చిమ దిశ నుంచి వీచే గాలులు రుతుపవనాలను కేరళ తీరం వైపు నెట్టడంలో సహాయపడాలి కానీ ప్రస్తుతం గాలి దిశ, వేగం ఇందుకు అనుకూలంగా లేవు. అయితే ఈ ఆలస్యానికి రాబోయే ఎల్‌నినో ప్రభావానికి ఎలాంటి సంబంధం లేదని స్కైమెట్ వాతావరణ, వాతావరణ మార్పుల విభాగంలో వైఎస్ ప్రెసిడెంట్ మహేష్ స్పష్టం చేశారు. రుతుపవనాలు కేవలం భారత్ పరిసరాల్లోని వాతావరణ వ్యవస్థలపైనే ఆధారపడి కేవలం భారత్ పరిసరాల్లోని వాతావరణ వ్యవస్థపైనే ఆధారపడి ఉంటాయని ఆయన వివరించారు. కేరళలోని రుతుపవనాలు ప్రవేశించాయని చెప్పడానికి కొన్ని కచ్చితమైన నియమాలు ఉన్నాయి. అవి పూర్తి అయితేనే అధికారికంగా రుతుపవనాల రాకను ప్రకటిస్తారు. కేరళ, కర్ణాటక, లక్ష్యద్వీప్‌లోని సుమారు 60 శాతం వాతావరణ కేంద్రాల్లో వరుసగా రెండు రోజులపాటు కనీసం 2.5 మి.మి. వర్షపాతం నమోదు కావాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పరిమితి ఇంకా నెరవేరలేదు. అందుకే అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతానికి రుతుపవనాలు ఆగిపోయినప్పటికీ , ఆశాజనకమైన వార్త కూడా ఉంది. స్కైమెట్ అంచనాల ప్రకారం రాబోయే గురువారం లేదా శుక్రవారం నాటికి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉంది. వచ్చే 3-4 రోజుల్లో అరేబియా సముద్రంలోని మిగిలిన ప్రాంతాలు, బంగళాఖాతంలోని మెజారిటీ ప్రాంతాలు, కేరళ, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు ఇవి విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. పరిస్థితిని సమీక్షిస్తున్న ఐఎండీ త్వరలోనే రుతుపవనాల రాకపై సవరించిన తేదీని ప్రకటించే అవకాశం ఉంది. భారత్‌లో రుతుపవనాలకు కేరళ ప్రవేశ ద్వార లాంటిది. ఇక్కడికి రుతుపవనాలు చేరిన తర్వాతే దేశవ్యాప్తంగా వర్షాలు విస్తరిస్తాయి. వర్షాలపైనే దేశంలోని సుమారు 70 శాతం సాగు భూమి ఆధారపడి ఉంది. రుతుపవనాలు ఆలస్యమైతే విత్తనాలు వేయడం ఆలస్యమవుతుంది. అది ఆహార ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపుతుంది. అయితే కొన్ని రోజుల జాప్యం సర్వసాధారణమేనని, రుతుపవనాలు పుంజుకుంటే ఆ తర్వాత వర్షపాతం సాధారణంగానే ఉండొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

## ఆకాశమే హద్దుగా హైదరాబాద్..

## దక్షిణ భారత స్కైస్క్రేపర్ రాజధానిగా భాగ్యనగరం!

- మొదటి పేజి తరువాయి

దీంతో, హైదరాబాద్ ఇప్పుడు 'దక్షిణ భారతదేశపు స్కైస్క్రేపర్ రాజధాని'గా వేగంగా రూపాంతరం చెందుతోంది.

**రికార్డులు తిరగరాస్తున్న నిర్మాణాలు**

2026 నాటికి, హైదరాబాద్‌లో 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న 275 భవనాలు, 150 మీటర్లు దాటిన 50కి పైగా ఆకాశహర్మ్యాలు ఉండటం ఈ వృద్ధికి నిదర్శనం. ప్రస్తుతం కోకాపేటలో నిర్మించిన 'శాస్ క్రౌన్' , 235.3 మీటర్ల ఎత్తు (58 అంతస్తులు)తో దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఎత్తైన పూర్తిస్థాయి నివాస భవనంగా రికార్డు సృష్టించింది. ఈ రికార్డును సైతం అధిగమించేలా, పుప్పాలగూడలో దాదాపు 244 మీటర్ల ఎత్తుతో 'క్యాండ్యూర్ స్కైలైన్' నిర్మాణం జరుగుతోంది. ఇది పూర్తయితే నగరంలో మరో కొత్త అధ్యాయం మొదలవుతుంది.

వీటితో పాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని డైమండ్ టవర్ (187 మీటర్లు), మైస్కేప్ యూ రెసిడెన్సెస్ (201 మీటర్లు), డీఎస్ఆర్ ది ట్విన్స్, రాఘవ ఐరిస్, ఫీనిక్స్ ట్రైటాన్ వంటి అనేక ప్రాజెక్టులు హైదరాబాద్ స్కైలైన్‌ను పునర్ నిర్వచిస్తున్నాయి. కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నియోపోలిస్, తెల్లాపూర్, పుప్పాలగూడ వంటి ప్రాంతాలు ఈ భారీ నిర్మాణాలకు కేంద్ర బిందువులుగా మారాయి.

**నిలువుగా ఎదగడానికి కారణాలివే!**

హైదరాబాద్‌లో ఈ ఆకాశహర్మ్యాల సంస్కృతి పెరగడానికి అనేక కారణాలున్నాయి.

1.ప్రభుత్వ విధానాలు: 2014 తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సరళీకృత విధానాలు, ముఖ్యంగా ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (FSI) పై ఎటువంటి పరిమితులు విధించకపోవడం డెవలపర్లకు వరంలా మారింది. టీఎస్-బీపాస్ ద్వారా నిర్మాణ అనుమతులు వేగంగా లభించడం కూడా ఈ వృద్ధికి ఊతమిచ్చింది. 2. భూముల ధరలు: పశ్చిమ హైదరాబాద్‌లో భూముల ధరలు ఆకాశాన్నంటడంతో, తక్కువ స్థలంలో ఎక్కువ నిర్మాణాలు చేపట్టడం ద్వారా ప్రాజెక్టులను లాభసాటిగా మార్చుకోవడానికి బిల్డర్లు ఎత్తైన భవనాల వైపు మొగ్గుచూపుతున్నారు. 3. ఐటీ బూమ్: ఐటీ రంగం విస్తరణ, ఇతర రాష్ట్రాల నుంచి వృత్తి నిపుణుల వలసలు పెరగడంతో ప్రీమియం, విలాసవంతమైన ఇళ్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది.

**పెరుగుతున్న అనుమతులు, భవిష్యత్ అంచనాలు**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ , హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎవీణూా) పరిధిలో 2025లో సుమారు 200 భారీ భవనాలకు అనుమతులు లభించాయి. ఇది 2024తో పోలిస్తే రెట్టింపు. రాబోయే రోజుల్లో ఈ ట్రెండ్ మరింత పెరగనుంది. ఉస్మాన్‌నగర్‌లో 70 అంతస్తులు (సుమారు 250 మీటర్లు), కోకాపేటలో 66 అంతస్తుల భవన నిర్మాణాలకు సైతం అనుమతులు లభించాయి. 2029-30 నాటికి నగరంలో ఇలాంటివి మరెన్నో ఆకాశహర్మ్యాలు వెలుస్తాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**వినియోగదారులపై ప్రభావం**

ఈ ఆకాశహర్మ్యాలు ప్రపంచస్థాయి జీవన ప్రమాణాలను, విలాసవంతమైన సౌకర్యాలను అందిస్తున్నప్పటికీ, వాటి ధరలు, నిర్వహణ ఖర్చులు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి.

ధరలు: ఈ భవనాల్లో చదరపు అడుగు ధర రూ. 10,000 దాటిపోయింది. ఇది నగర సగటు ధర (రూ. 7,000-8,000) కంటే చాలా ఎక్కువ.

నిర్వహణ ఛార్జీలు: అత్యాధునిక లిఫ్టులు, నిరంతర విద్యుత్, పటిష్ఠమైన భద్రత, అగ్నిమాపక వ్యవస్థల కారణంగా నిర్వహణ ఛార్జీలు కూడా అధికంగా ఉంటున్నాయి. సాధారణంగా చదరపు అడుగుకు రూ. 3 ఉండే మెయింటెనెన్స్, ఈ భవనాల్లో రూ. 6 వరకు ఉంటోందని క్రెడాయ్ హైదరాబాద్ ప్రతినిధులు వివరిస్తున్నారు.

తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్. ప్రవీణ్ ఒక సందర్భంలో మాట్లాడుతూ, "కొనుగోలుదారులను ఆకర్షించడానికి డెవలపర్లు క్లబ్‌హౌస్‌లు, స్విమ్మింగ్ పూల్స్, కో-వర్కింగ్ స్పేస్‌లు, క్రీడా సౌకర్యాలు వంటి అనేక సదుపాయాలను అందించి, తమ ప్రాజెక్టులను ప్రత్యేకంగా నిలుపుకుంటున్నారు" అని పేర్కొన్నారు.

మొత్తంమీద, హైదరాబాద్ మహానగరం వేగవంతమైన పట్టణీకరణ, ఉన్నత జీవనశైలి వాగ్దానాల మధ్య సమతుల్యం సాధిస్తూ, తన భవిష్యత్ చిత్రాన్ని ఆకాశమంత ఎత్తులో నిర్మించుకుంటోంది. ఈ ప్రయాణంలో ఎదురయ్యే మౌలిక సదుపాయాల సవాళ్లను అధిగమించగలిగితే, హైదరాబాద్ దేశంలోనే ఒక మోడల్ వర్టికల్ సిటీగా నిలవడం ఖాయం.

# ఏపీ కేబినెట్ భేటీ.. 'అమరావతి ఐ' సహా కీలక ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్

- మొదటి పేజి తరువాయి

పటంలో అమరావ తికి ప్రత్యేక స్థానం కల్పిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

**రాజధాని నిర్మాణ పనులకు ఊతం**

అమరావతిలో నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా కేబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది. హైకోర్టు భవనం బాహ్య సుందరీకరణ పనుల కోసం రూ. 547 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. అదేవిధంగా, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, ప్రిన్సిపల్ సెక్రటరీల నివాస భవనాల్లో హోమ్ ఆటోమేషన్, ఇతర ఆధునిక సౌకర్యాల కల్పన కోసం రూ. 94.90 కోట్ల పనులకు ఆమోదం తెలిపింది. రాజధానిలో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం కోసం ఏపీఐఐసీకి ఎనిమిది ఎకరాల భూమి కేటాయింపును నిర్ధారించారు. రానున్న 9-10 నెలల్లో దీని నిర్మాణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**గ్రామీణ ఉపాధికి 125 రోజుల గ్యారెంటీ**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్' (ఎదీ+-=ూహీూజీ×) పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. జూలై 1, 2026 నుంచి ఈ పథకం అమలులోకి వస్తుంది. దీని కింద ప్రస్తుతం ఉన్న 100 రోజుల ఉపాధి హామీని 125 రోజులకు పెంచారు. దీనివల్ల ప్రతి గ్రామీణ కుటుంబానికి అదనంగా ఏటా రూ. 7,675 లబ్ధి చేకూరుతుంది. ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు సమకూరుస్తాయి. అంతేకాకుండా, కూలీలకు 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలని, ఆలస్యమైతే రోజుకు 0.05% చొప్పున వడ్డీ చెల్లించాలని నిబంధన విధించడం గమనార్హం.

**కొత్త పాలసీలతో ప్రగతి పథం**

విమానయాన పాలసీ: రాష్ట్ర విమానయాన రంగంలో భారీ లక్ష్యాలతో కొత్త పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. 2035 నాటికి ప్యాసింజర్ మార్కెట్ షేర్‌ను 4 శాతానికి, ఎయిర్ కార్గో మార్కెట్ షేర్‌ను 5 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొత్త విమానాశ్రయాలు, వాటర్ డ్రోమ్‌ల ఏర్పాటు, ఏరోస్పేస్ తయారీలో పెట్టుబడులను ఆకర్షించడం ఈ పాలసీ ముఖ్య ఉద్దేశాలు.

బీచ్ షాక్ పాలసీ: రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు గోవా, ఒరిస్సా తరహాలో బీచ్ షాక్‌ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పైలట్ ప్రాజెక్ట్‌గా తొలి దశలో చీరాలలోని సూర్యలంక, విశాఖపట్నం బీచ్‌లలో రెండేసి చొప్పున షాక్‌లను ఏర్పాటు చేస్తారు.

అవయవదాన చట్టం: అవయవదానం, అవయవ మార్పిడి కార్యకలాపాలను నియంత్రించేందుకు కేంద్రం తీసుకొచ్చిన 'ది ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ యాక్ట్-2011'ను రాష్ట్రంలో అమలు చేసేందుకు కేబినెట్ నిర్ణయించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు, అవయవాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈ చట్టాన్ని ఆర్డినెన్స్ రూపంలో తీసుకురానున్నారు.

**వ్యవసాయం, పరిశ్రమలకు చేయూత**

పోలవరం ఎడమ ప్రధాన కాలువ ప్యాకేజీ 5, 5ూ పనులకు సంబంధించి అంచనా వ్యయాన్ని రూ. 352.6 కోట్ల నుంచి రూ. 796.66 కోట్లకు సవరిస్తూ కేబినెట్ పరిపాలన అనుమతులు ఇచ్చింది. అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టుకు 21 పోస్టులను మంజూరు చేసింది. ఈ కేసుల పరిష్కారానికి మంత్రులతో ఒక సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం నెడ్‌క్యాప్ ద్వారా పలు కంపెనీలకు భూములు లీజుకు ఇచ్చే ప్రతిపాదనలకు కూడా ఆమోదం లభించింది.

**ఇతర కీలక నిర్ణయాలు**

శ్రీ సిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ: తిరుపతి జిల్లా శ్రీ సిటీలో కొత్త ప్రైవేట్ యూనివర్సిటీ ఏర్పాటుకు వీలుగా ఏపీ ప్రైవేట్ యూనివర్సిటీ యాక్ట్-2016 సవరణకు ఆర్డినెన్స్ జారీకి ఆమోదం.

అంతర్జాతీయ యోగా దినోత్సవం: జూన్ 7 నుంచి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు రూ.10 కోట్లు మంజూరు.

భూముల రీ-క్లాసిఫికేషన్: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు గ్రామంలోని 25 ఎకరాల 'ట్యాంక్ పోరంబోకు' భూమిని 'గ్రామ కంఠం'గా మార్చేందుకు నిర్ణయం. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సమస్యలను పరిష్కరించాలని సీఎం ఆదేశించారు.

టీడీపీ కార్యాలయాలకు భూమి: అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో తెలుగుదేశం పార్టీ కార్యాలయాల నిర్మాణానికి 66 ఏళ్ల లీజు ప్రాతిపదికన భూమి కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

మొత్తంమీద, ఈ కేబినెట్ సమావేశం రాజధాని అమరావతి నిర్మాణాన్ని పరుగులు పెట్టించడం, పర్యాటక రంగానికి కొత్త ఊపునివ్వడం, గ్రామీణ ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడం, పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేయడం వంటి బహుముఖ లక్ష్యాలతో సాగింది. ఈ నిర్ణయాలు రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రగతిపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేస్తోంది.

# పవన్ సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదు?

తెలంగాణలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ సభ పెడతానంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా, ఎక్కడైనా సభ పెట్టుకునే హక్కు ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జనసేన సభకు ఎందుకు అనుమతి ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఉద్దేశపూర్వకంగానే మళ్లీ తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టాలని చూస్తున్నాయని ఆరోపించారు. ఈ రెండు పార్టీలను ప్రజలు పూర్తిగా తిరస్కరించే పరిస్థితి వచ్చిందని అన్నారు. అందుకే తమ ఉనికిని కాపాడుకోవడానికే మళ్లీ ప్రాంతీయ సెంటిమెంట్‌ను వాడుకుంటున్నాయని మండిపడ్డారు. గతంలో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన ఎంఐఎంతో బీఆర్ఎస్ కలిసి పనిచేయలేదా? అని ఆయన నిలదీశారు. అది తెలంగాణ వ్యతిరేక శక్తులతో పనిచేసినట్లు అవ్వదా? అంటూ ప్రశ్నించారు. రాజకీయ పరిస్థితులను బట్టి తెలంగాణలో పొత్తుపై ముందుకెళ్తామని రామచందర్ రావు స్పష్టం చేశారు. జనసేనతో పొత్తుపై పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు.

# రేవంత్ పర్యటన విహారయాత్ర లాంటిది

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు పాదయాత్రకు సిద్ధమైనప్పుడే ప్రభుత్వానికి ప్రాజెక్టుల తనిఖీలు గుర్తొస్తున్నాయని, ఇందులో వారి చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు.

కేసీఆర్ హయాంలోనే ఈ ప్రాజెక్టుల పనులు 80 నుంచి 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన కేవలం పబ్లిసిటీ కోసం చేసిన 'హెలికాప్టర్ విహారయాత్ర' లాంటిదేనని విమర్శించారు.

కొల్లాపూర్ ప్రాంతంలో హార్టికల్చర్, పాలిటెక్నిక్ కాలేజీల ఏర్పాటును పక్కనబెట్టారని, మామిడి రైతులకు న్యాయం చేయలేదని మండిపడ్డారు. అలాగే, బీఆర్ఎస్ నేత శ్రీధర్ రెడ్డి హత్య జరిగి రెండేళ్లవుతున్నా విచారణలో పురోగతి లేదని, సీఎం పర్యటనల వేళ ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి పిక్నిక్ తరహా పర్యటనలు ఆపి, పాలమూరు అసలు సమస్యలపై, 'రామన్నగుట్ట రిజర్వాయర్' ప్రాజెక్టుపై స్పష్టమైన సమీక్ష నిర్వహించాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

# పవన్ కల్యాణ్ భాష, తీరు సరిగా లేదు

తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ కూటమి నాయకులకు, ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు గట్టి కౌంటర్ ఇచ్చారు. మీడియా ప్రతినిధులతో జరిగిన చిట్‌చాట్‌లో ఆయన ఏపీ నాయకుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరుగుతున్న ఈ కీలక సమయంలో.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇక్కడ సభలు నిర్వహిస్తామనడం ఎంతమాత్రం సరైనది కాదని గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఇటీవల జరిగిన మీడియా సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడిన భాష, ఆయన తీరు అస్సలు బాలేదని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిపై కూడా గుత్తా సుఖేందర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "అమరావతి బ్రహ్మాండమైన రాజధాని అని చెబుతున్న ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, అక్కడి మంత్రులు ముందు అమరావతిలోనే నివాసం ఉండాలి" అని సూచించారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువ వనరులు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఏపీకి సుదీర్ఘమైన సముద్ర తీరంతో పాటు, రకరకాల పోర్టులు కూడా ఉన్నాయని... కాబట్టి ఆ నాయకులంతా వారి రాష్ట్ర అభివృద్ధిని చూసుకోవాలి తప్ప, తెలంగాణ వైపు చూడాల్సిన అవసరం లేదని హితవు పలికారు. ఇక్కడ ఎలాంటి విద్వేషాలు సృష్టించడానికి ప్రయత్నించవద్దని హెచ్చరించారు.

తెలంగాణ వ్యవసాయ రంగం, ధాన్యం కొనుగోళ్లపై గుత్తా సుఖేందర్ రెడ్డి పలు వివరాలను పంచుకున్నారు. తెలంగాణలో ఇప్పటికే 75 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం సహకరించడం లేదని ఆరోపించారు. రైతులు సాంప్రదాయ పద్ధతుల్లోనే కాకుండా పంట మార్పిడి వైపు దృష్టి సారించాలని కోరారు. ప్రస్తుతం మన రైతులు వరి, పత్తి తప్ప వేరే ఇతర పంటలు పండించడం లేదని, దీనిపై మార్పు రావాలని ఆయన వివరించారు.

# దమ్ముంటే నన్ను అరెస్ట్ చేయండి

- మొదటి పేజి తరువాయి

విరుచుకుపడ్డారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ అవగాహన సదస్సులో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వానికి ఒక సవాల్ విసిరారు."నేను బియ్యం దొంగతనం చేశానని నాపై ఆరోపణలు చేస్తున్నారు. మీకు నిజంగా ధైర్యముంటే, నాపై విచారణ జరిపించి నన్ను జైల్లో పెట్టండి. 2029 నాటికి చంద్రబాబు ప్రభుత్వం కచ్చితంగా పడిపోతుంది. అంతవరకు మీకు చేతనైతే, దమ్ముంటే నన్ను అరెస్ట్ చేయండి" అంటూ పేర్ని నాని సంచలన వ్యాఖ్యలు చేశారు. స్పోర్ట్స్ కోటా నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని పేర్ని నాని ఆరోపించారు. ప్రభుత్వం మొదట క్రీడా కోటాను 3 శాతానికి పెంచుతూ జీవో ఇచ్చిందని, ఆ తర్వాత 382 మంది ఎంపికయ్యారని చెప్పిందని.. కానీ ఇటీవలే ఆటల సంఖ్యను 29 నుంచి ఏకంగా 67 కి పెంచి, అందులో 'బ్రిడ్జ్' (పేకాట) ను కూడా చేర్చారని విమర్శించారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను గత 9 నెలలుగా ఎందుకు బహిరంగపరచడం లేదు? ఐఏఎస్ అధికారి సంతకం కూడా లేకుండా ఆ లిస్ట్‌ను ఎలా విడుదల చేశారు? ఇప్పుడు కార్డు గేమ్స్ (పేకాట) ఆడేవారిని ఎంపిక చేయలేదని ప్రభుత్వం ఎందుకు మాట మారుస్తోంది? అని ప్రశ్నించారు. డీఎస్సీ నియామకాల్లో జరిగిన భారీ అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికే కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడానికి హోంమంత్రి అనితను ఒక కవచంలా వాడుకుంటోందని పేర్ని నాని మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అరాచకాలపై నోరు మెదపని ప్రభుత్వం.. ప్రతిపక్షాలు డీఎస్సీ స్కామ్‌ను లేవనెత్తినప్పుడు మాత్రం హైపర్‌యాక్టివ్‌గా మారుతోందని ధ్వజమెత్తారు. డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో జరిగిన 'పాపాలు' చంద్రబాబును, ఆయన మంత్రులను వదిలిపెట్టవని పేర్ని నాని హెచ్చరించారు.

# ప్రకాశం జిల్లాలో తీవ్ర విషాదం...

# ఈతకు వెళ్లి నలుగురు చిన్నారుల మృతి

- మొదటి పేజి తరువాయి

సుశాంత్ అన్నదమ్ములు. వేసవి తాపం అధికంగా ఉండటంతో ఉపశమనం కోసం వీరంతా సరదాగా ఈత కొట్టేందుకు గ్రామ సమీపంలోని ఓ నీటి గుంట వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానిక గజ ఈతగాళ్లు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటి తర్వాత నలుగురి మృతదేహాలను వెలికితీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దుర్ఘటనపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డీఎస్‌బీవీ స్వామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## వైసీపీ మాజీ ఎమ్మెల్యే బెయిల్ పిటిషన్..

## తెలంగాణ హైకోర్టు నోటీసులు

- మొదటి పేజి తరువాయి

న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు.. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో స్పందించాలంటూ అటు నార్సింగి పోలీసులకు, ఇటు తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి సమాచారం, ఆధారాలతో కూడిన కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న అనంతరం, హైకోర్టు ఈ కేసు తదుపరి విచారణను ఈనెల 11వ తేదీకి వాయిదా వేసింది.

## నేడు విశాఖకు సీఎం చంద్రబాబు...

- మొదటి పేజి తరువాయి

జరగనున్న కీలకమైన జాతీయ సదస్సుకు ఆయన హాజరుకానున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం సైకిల్‌పై ప్రయాణించడం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

అధికారిక పర్యటన వివరాల ప్రకారం, సీఎం చంద్రబాబు శుక్రవారం ఉదయం 8:30 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి 10:00 గంటలకు విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానానికి చేరుకుంటారు. అక్కడ 'నెట్ జీరో' కార్యక్రమంలో భాగంగా మొక్కను నాటి, అనంతరం బీచ్ రోడ్డులోని నోవోటెల్ హోటల్ వరకు సైకిల్‌పై ప్రయాణిస్తారు. హోటల్‌లో జరిగే జాతీయ సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ వర్క్‌షాప్‌లో పాల్గొంటారు. ఈ సదస్సుకు కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, చిరాగ్ పాశ్వాన్, రాజీవ్ రంజన్ సింగ్, జార్జ్ కురియన్, ఎస్పీ సింగ్ భగేల్ వంటి ప్రముఖులు హాజరుకానున్నారు.ఈ వర్క్‌షాప్‌లో ఆక్వాకల్చర్, మత్స్య రంగంలో అవకాశాలు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. ముఖ్యంగా యూరోపియన్ యూనియన్‌తో పాటు ఇతర అంతర్జాతీయ మార్కెట్లకు మన ఉత్పత్తులను ఎగుమతి చేయడం, ఎదురవుతున్న సవాళ్లు, ప్రత్యామ్నాయ మార్కెట్లపై దృష్టి సారించనున్నారు. ట్రేసబిలిటీ వ్యవస్థలను పటిష్ఠం చేయడం, ఆక్వాకల్చర్‌లో సర్టిఫికేషన్ విధానాలను ప్రోత్సహించడం ద్వారా స్థిరమైన పద్ధతులను అవలంబించడంపై చర్చిస్తారు. అలాగే, డీప్ సీ ఫిషింగ్, అండమాన్ నికోబార్, లక్షద్వీప్ వంటి ప్రాంతాల్లోని అధిక విలువ కలిగిన మత్స్య సంపద వినియోగం, సీవీడ్, ముత్యాల పెంపకం వంటి నూతన రంగాల అభివృద్ధిపై కూడా ఈ సదస్సులో కీలక చర్చ జరగనుంది.విలువ జోడించిన ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రాజెక్ట్ లింక్డ్ ఇన్సెంటివ్ (PLI) స్కీమ్, ఎంఎస్ఎంఈలకు లభించే మద్దతుపై కూడా ఈ వర్క్‌షాప్‌లో వివరించనున్నారు. ఈ సందర్భంగా పీఎంకేఎస్ఎస్‌వై (PMKSSY), కిసాన్ క్రెడిట్ కార్డ్ (KCC) పథకాల లబ్ధిదారులకు సీఎం చంద్రబాబు ప్రోత్సాహకాలను అందజేస్తారు. సదస్సు ముగిసిన అనంతరం, విశాఖ ఎకనమిక్ రీజియన్‌పై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. తన పర్యటన ముగించుకుని సాయంత్రం తిరిగి అమరావతికి పయనమవుతారు.

## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు.. ప్రాంతీయ పార్టీలతో కేంద్రం రహస్య సంప్రదింపులు!

- మొదటి పేజి తరువాయి

యత్నిస్తున్నట్లు సదరు వర్గాలు వెల్లడించాయి.

ఈ సంప్రదింపుల్లో భాగంగా కేంద్రం ఇప్పటికే తమిళనాడుకు చెందిన డీఎంకేతో పాటు పలు కీలక ప్రాంతీయ పార్టీలతో ప్రాథమిక చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్య 1971 జనాభా లెక్కల ఆధారంగానే చేసి ఉంది. ఆ గడువు ముగియనుండటంతో కొత్తగా పునర్విభజన చేపడితే జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెరిగి, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోతాయనే తీవ్ర ఆందోళనలు ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అందరికీ ఆమోదయోగ్యమైన ఫార్ములాను రూపొందించేందుకు కేంద్రం యత్నిస్తోందని సమాచారం. నిజానికి ఇటీవలే కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన బిల్లును పార్లమెంటు ముందుకు తీసుకువచ్చింది. అయితే ఆ సమయంలో ప్రాంతీయ పార్టీల నుంచి, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఫలితంగా ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై పార్లమెంటులో వ్యతిరేకంగా ఓటు వేయడంతో బిల్లు వీగిపోయింది. దీన్ని దృష్టిలో పెట్టుకునే.. ఈసారి బిల్లును నేరుగా సభలో పెట్టకుండా, ముందుగానే విస్తృత అవగాహన కుదిరిన తర్వాతే తదుపరి అడుగు వేయాలని కేంద్రం భావిస్తోందని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది.

## చంద్రబాబు అధ్యక్షతన ఎన్డీయే సమావేశం... హాజరైన పవన్ కల్యాణ్, మాధవ్

- మొదటి పేజి తరువాయి

కార్యక్రమాలు ఉండాలని ఈ సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు కూడా పాల్గొన్నారు. భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయంతో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని నేతలు నిర్ణయించినట్లు సమాచారం.

## పునాది, అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం పై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం.

* కోర్స్ డైరెక్టర్ పి.బి వివి ప్రసాద్.

**చింతపల్లి పెన్ పవర్ జూన్ 4.** విద్యార్థుల విద్యలో పట్టు సాధించేందుకు ఉపాధ్యాయులకు పునాది, అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం ( ఎఫ్ ఎల్ ఎన్ ) పై శిక్షణ ఇస్తున్నామని మండల విద్యాశాఖ అధికారి, కోర్స్ డైరెక్టర్ పీ. బీ.వీవి ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చింతపల్లి జికె వీధి మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు కోర్స్ డైరెక్టర్ ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి రెండు తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఈ నెల 9 వరకు శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు హాటపాట్లతో బోధన అందించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ప్రతి విద్యార్థి తెలుగు ఆంగ్లం గణితంలో పట్టు సాధించాలనేది శిక్షణ ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ శిక్షణా తరగతులకు 380 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారని ఆయన



తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి శిక్షణ కేంద్రం ఇన్చార్జి గిడ్డి వరలక్ష్మి ఎంఈఓ 2 డిఆర్పీలు కుడుముల వెంకటరమణ, సాయికుమార్, మచ్చలింగం, వినోద్ కుమార్, సత్యనారాయణ, ఎస్ రాజేశ్వరి,సురేష్ కుమార్ పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# టీడీపీ హామీల అమలులో విఫలం




* టీడీపీ మేనిఫెస్టో ప్రతుల దహనం
* పాడేరు ఎమ్మెల్యే మత్స్యరస విశ్వేశ్వర రాజు

**జి.మాడుగుల,పెన్ పవర్,జూన్ 4:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పాడేరు ఎమ్మెల్యే, అల్లూరి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు విమర్శించారు. గురువారం జి.మాడుగుల మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన “చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు” నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో, చంద్రబాబు నాయుడు--పవన్ కళ్యాణ్ సంతకాలతో విడుదల చేసిన బాండ్ల ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల హామీల అమలుపై దృష్టి సారించకుండా ప్రజలను నిరాశపరుస్తోందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారని పేర్కొన్నారు.సూపర్ సిక్స్ పథకాల కింద యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, రైతులకు వార్షిక ఆర్థిక సాయం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు నెలవారీ ఆర్థిక సహాయం వంటి హామీలు ఇప్పటికీ అమలు కాలేదని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళల భద్రత, విద్య, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, మండల అధ్యక్షుడు నుర్మాని మత్స్యకొండం నాయుడు, వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వంజరి సీతారాం నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి కూడ సురేష్‌కుమార్, క్రిస్టియన్ మైనారిటీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రకృతి - వికృతి

**నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం**

**పర్యావరణంపై ప్రభుత్వానికి పట్టదు -ప్రజలు పట్టించుకోరు**

**ప్రకృతిలో మార్పులు సంభవిస్తు వర్షాభావ,అధిక ఉష్ణోగ్రతలు కారణం ముమ్మాటికి మానవ తప్పిదాలే!**

**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూన్ 4:** ప్రజలారా మేల్కొనండి ప్రభుత్వమా కళ్ళు తెరవండి
రాబోయే తరాలకు ప్రకృతి వరాలను ప్రసాదిద్దాం.
ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను ప్రభుత్వాలు ఘనంగా నిర్వహిస్తూ ఉంటాయి. ఫోటోలు పబ్లిసిటీ వరకే పర్మిట్ అవుతున్న ఈ కార్యక్రమాలు రోజు గడిచిన తర్వాత యధా ప్రకారం రోజులు గడుస్తూనే ఉంటాయి. ప్రకృతి పై పర్యావరణం పై ప్రభుత్వాలు కఠినమైన చర్యలు చేపట్టం. పర్యావరణ వేత్తల హెచ్చరికలు ప్రభుత్వానికి పట్టవు పైగా ప్రభుత్వ చేపడుతున్న అభివృద్ధి పేరుట పర్యావరణానికి కలిగిస్తున్న ఆనిపై ప్రశ్నించిన వారిపై చర్యలు చేపట్టడమే కాకుండా అభివృద్ధిని అడ్డుకుంటారా అనే నెపం వేస్తుంది. ఇప్పటికైనా ప్రజా సంఘాలు ప్రజలు మేల్కొని మొక్కలు నాటే కార్యక్రమాల వరకే పరిమితం కాకుండా స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం.




# జనసేన రాష్ట్ర సేనదళం కమిటీలో డాక్టర్ వంపూరు గంగులయ్యకు బాధ్యతలు

**గూడెం కొత్తవీధి జనసైనికుల్లో హర్షాతిరేకం**

**గూడెం కొత్త వీధి, పెన్ పవర్,జూన్ 4:** జనసేన పార్టీ రాష్ట్ర సేనదళం కమిటీలో పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా. వంపూరు గంగులయ్యకు బాధ్యతలు అప్పగించడంపై జీకే వీధి మండల జనసేన నాయకులు, జనసైనికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తూ, పాడేరు నియోజకవర్గంలో జనసేన పార్టీ అభివృద్ధికి విశేష సేవలందిస్తున్న డా. గంగులయ్యకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించడం సంతోషకరమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న నాయకులను గుర్తించి బాధ్యతలు అప్పగించడం జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వ దూరదృష్టికి నిదర్శనమని కొనియాడారు.ఆంధ్రప్రదేశ్ జానపద కళలు సృజనాత్మక అకాడమీ చైర్మన్‌గా, పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా డాక్టర్ గంగులయ్య ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీ అభివృద్ధికి విశేషంగా తోడ్పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర సేనదళం కమిటీలో ఆయనకు స్థానం కల్పించడం ద్వారా పాడేరు నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ వంపూరు గంగులయ్యకు బాధ్యతలు అప్పగించినందుకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గంగులయ్య మార్గదర్శకత్వంలో పార్టీని గ్రామ గ్రామాన బలోపేతం చేస్తూ ప్రజా



సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు సంకల్పం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు, అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గొర్లె వీరవెంకట్, వాసుపరి ప్రసాద్, పొత్తూరు విష్ణుమూర్తి, కొయ్యం ఇమ్మానుయేల్, గడుతూరి పరమేశ్వరరావు, విరోజీ త్రిమూర్తులు, నాడేల సత్యారావు, ఉల్లం ఈశ్వరరావు, గబులంగి గణేష్,వంశీ, పాంగి శ్రీను, సాగిన బ్రహ్మజీ, పాల్స్, కోటి, నాగేంద్ర, రేణుక, ఉమాదేవి, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు ప్రమాదంలో మహిళ కాలుకు తీవ్రగాయం





* మానవత్వం మరిచిన ఆర్టీసీ అధికారులు,
* కేసు నమోదు చేయడం కుదరదు అంటున్న పోలీసులు
* దిక్కుతోచని స్థితిలో శ్రీకాకుళం కిమ్స్‌లో చికిత్స పొందుతున్న గజలక్ష్మి

**టెక్కలి, పెన్ పవర్ జూన్ 4 :** ఇటీవల జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో ఆర్టీసీ సిబ్బంది నిర్లక్ష్యం ఒక పేద మహిళ జీవితాన్ని రోడ్డున పడేసింది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన ఆర్టీసీ సిబ్బంది, బస్సులో ప్రమాదం జరిగితే మాకేం సంబంధం లేదంటూ చేతులు ఎత్తేశారు. అటు ఖాకీలు, ఇటు ఆర్టీసీ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంతో ఓ పేద మహిళ ప్రస్తుతం ఆసుపత్రి మంచంపై నరకయాతన అనుభవిస్తోంది.


వివరాల్లోకి వెళితే శ్రీకాకుళం జిల్లా, టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాలి మండలం చిన్నతుంగాం గ్రామానికి చెందిన సాహుకారి గజలక్ష్మి అనే మహిళ విశాఖ బోయపాలెం దగ్గర శ్రీకాకుళం డిపో-1 కు చెందిన ఒక ఆర్టీసీ బస్సు ఎక్కింది. బస్సు పూసపాటిరేగ సమీపం లోకి వచ్చేసరికి ఒక్కసారిగా వెనుక ఎడమవైపు ఉన్న టైర్ పేలిపోయింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న గజలక్ష్మి ఎడమ కాలు పాదం పూర్తిగా నుజ్జునుజ్జు అయిపోయింది. అయితే ఆ సమయంలో బస్సు సిబ్బంది పట్టించుకోకపోయినా తోటి ప్రయాణికురాలు సహాయాన్ని అందించింది. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు సిబ్బంది (డ్రైవర్, కండక్టర్) కనీస మానవత్వం కూడా చూపకుండా ప్రయాణికురాలిని గాలికి వదిలేశారు. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న ఆమెను చూసి చలించిపోయిన తోటి మహిళా ప్రయాణికురాలు వెంటనే స్పందించింది. దగ్గరలో ఉన్న ఆర్ఎమ్‌పీ ను పిలిపించి, ప్రాథమిక చికిత్స చేయించి, మానవత్వంతో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది కూడా బాధితురాలి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. సరిగ్గా పట్టించుకోకుండా విశాఖ కేజీహెచ్‌కు వెళ్లి పోవాలంటూ చేతులు దులుపుకున్నారు. అక్కడ చూసుకోవడానికి ఎవరూ లేకపోవడంతో, గత్యంతరం లేక బాధితురాలు శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రిలో చేరింది. అత్యంత పేద కుటుంబానికి చెందిన గజలక్ష్మికి ఇప్పటివరకు సుమారు రెండు లక్షల రూపాయల వరకు ఖర్చయింది. అంత డబ్బు పెట్టినా ఆమె కాలు అసలు నయమవుతుందో లేదో చెప్పలేమని వైద్యులు అనడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ప్రమాదం జరిగి ఇన్ని రోజులవుతున్నా కనీసం ఒక్క ఆర్టీసీ అధికారి కూడా బాధితురాలిని పరామర్శించడానికి గానీ, విచారణ చేయడానికి గానీ రాకపోవడంతో పలువురు ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యాన్ని తప్పుపడుతున్నారు. బాధితురాలి బంధువులు న్యాయం కోసం శ్రీకాకుళం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించగా, అక్కడ కూడా చేదు అనుభవమే ఎదురైంది. ప్రమాదం జరిగిన ప్రాంతం తమ పరిధిలోకి రాదని, ఎక్కడ జరిగిందో అక్కడికే వెళ్లాలని పోలీసులు కేసు నమోదు చేయకుండా తప్పుకున్నారు. కనీసం “జీరో ఎఫ్ఐఆర్” కింద ఫిర్యాదు తీసుకొని, సంబంధిత స్టేషన్‌కు రిఫర్ చేయాలన్న కనీస చట్టపరమైన బాధ్యతను కూడా పోలీసులు మరచిపోవడం బాధాకరమని కుటుంబ సభ్యులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం అన్న నమ్మకంతో ఒక పేద మహిళ ఆర్టీసీ బస్సు ఎక్కితే, కాలు పోగొట్టుకుని ఆసుపత్రి పాలైంది. ఇటు ఆర్టీసీ యజమాన్యం, అటు పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయం. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ వెంటనే స్పందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

బాధితురాలికి తక్షణ ఉచిత వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని, బాధితురాలకి తగిన నష్టపరిహారం ఇప్పించాలి కుటుంబ సభ్యులు బంధువులు కోరుతున్నారు. బాధ్యులైన బస్సు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## చింతపల్లి తహసిల్దార్ కే. శంకర్రావు బదిలీ.



**చింతపల్లి పెన్ పవర్ జూన్ 4.** చింతపల్లి మండల తహసిల్దారుగా విధులు నిర్వహించిన కె. శంకర్రావుని డుంబ్రిగూడ మండలం బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తహసిల్దార్ శంకర్రావు ఐదు నెలలుగా మండలంలో పనిచేసే తనదైన ముద్రను వేశారు. మ్యుటేషన్లు, భూ సమస్యల పరిష్కారం, రీ సర్వే పట్టాల పంపిణీకి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. పనిచేసిన ఐదు నెలల కాలంలో మండల వాసుల మన్ననలను పొందారు. ఈయన స్థానంలో డుంబ్రిగూడ తహసిల్దార్ త్రివేణి ని నియమించారు. ఈ మేరకు ఆమె శుక్రవారం విధులలో చేరనున్నారు.

## పిడుగుపాటుకు ముక్కలు చెక్కలుగా చీలిపోయిన వృక్షం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూన్ 4:** అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ప్రస్తుతం పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో జీకేవీధి మండలం మొండి గెడ్డ పంచాయతీ పరిధిలోని మొండికోట గ్రామ శివారులో బుధవారం పిడుగుపాటుకు భారీ సిల్వర్ ఓక్ వృక్షం విరిగి పడింది.పిడుగు తీవ్రతకు వృక్షం పూర్తిగా చీలిపోయి ముక్కలు చెక్కలై చెల్లాచెదురుగా పడినట్లు స్థానికులు తెలిపారు. ఘటన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ఈ ఘటనతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. అధికారులు, ప్రజలు వర్షాల సమయంలో చెట్ల కింద నిలవకుండా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

## ఆల్ ఇండియా దళిత యాక్షన్ కమిటీ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఆదినారాయణ



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,జూన్ 4:**ఆల్ ఇండియా దళిత యాక్షన్ కమిటీ జాతీయ ఉపాధ్యక్షుడిగా దుక్క ఆదినారాయణను నియమించినట్లు సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చి.నా.రాము తెలిపారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పాతర్లపల్లికి చెందిన ఆదినారాయణ విద్యాభివృద్ధి, దళితుల హక్కుల పరిరక్షణ కోసం విద్యార్థి దశ నుంచే సామాజిక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. గతంలో పలు రాజకీయ, సామాజిక బాధ్యతలు నిర్వహించిన ఆయన బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. జాతీయ స్థాయిలో దళితుల సామాజిక, రాజకీయ సమస్యలను ముందుకు తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని ఆదినారాయణ తెలిపారు. ఆయన నియామకాన్ని పలువురు సామాజికవేత్తలు, ప్రజా ప్రతినిధులు హర్షించారు.

## టెక్కలి గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు



**టెక్కలి, పెన్ పవర్ జూన్ 4 :** టెక్కలి శంభాన లోని శాఖా గ్రంథాలయం లో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థిని విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ మేరకు నీతి కథలు చదివించడం క్యారం బోర్డు, బెలూన్ గేమ్స్, డిబేట్లు తదితర పోటీలు నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన పోటీల్లో పాల్గొన్న వారికి ఈనెల 6 న బహుమతులు సర్టిఫికెట్లు ప్రధానం చేస్తామని గ్రంథాలయ అధికారి బి. రూపవతి తెలిపారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు చదువుతోపాటు, వినోదంతో కూడిన విజ్ఞానాన్ని, ఆరోగ్యం అందిస్తుందని విద్యార్థులకు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు వి.అమ్మన్న విద్యార్థులు పాల్గొన్నారు.


## కేజీహెచ్‌లో గాయపడిన బాధితులను పరామర్శించిన డాక్టర్ పసుపులేటి లక్ష్మణరావు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూన్ 4:** రోడ్డు ప్రమాదాల్లో గాయపడి విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలానికి చెందిన పలువురు బాధితులను ఆంధ్ర వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పసుపులేటి లక్ష్మణరావు గురువారం పరామర్శించారు. మండలంలోని ఎర్రవరం గ్రామానికి చెందిన కొర్ర బాబూరావు బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతుండగా, గైనిక్ వార్డులో చికిత్స పొందుతున్న చింతపల్లి గ్రామానికి చెందిన కొర్ర వెంకటలక్ష్మిని, అలాగే శస్త్రచికిత్స అనంతరం చికిత్స పొందుతున్న ఎర్రవరం గ్రామానికి చెందిన తాడి రమేష్, రింతాడ గ్రామానికి చెందిన బుజ్జిబాబులను ఆయన ట్రైబల్ సెల్ సిబ్బందితో కలిసి పరామర్శించారు.బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న డాక్టర్ లక్ష్మణరావు, వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఉద్యోగి దొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లోనే ఉత్తమ ఐటీడీఏగా 'పాడేరు' నీతి ఆయోగ్

### గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖల చేతుల మీదుగా అవార్డు అందుకున్న ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ




**పాడేరు, పెన్ పవర్,జూన్ 4:** గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో పాడేరు ఐటీడీఏ రాష్ట్రంలోనే సరికొత్త రికార్డు సృష్టించింది. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ఐటీడీఏల పరిధిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను లిపాడేరు ఐటీడీఏకు 'బెస్ట్ ఐటీడీఏ' (ఉత్తమ ఐటీడీఏ) జాతీయ స్థాయి అవార్డులి దక్కింది.
న్యూఢిల్లీలో జరిగిన ఒక ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ డాక్టర్ అశోక్ కుమార్, కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి (సెక్రటరీ) చేతుల మీదుగా పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ, ఏపిఓ(పివిటిజి ) ఏం. వెంకటేశ్వరరావు,ఈ అత్యున్నత పురస్కారాన్ని అత్యంత వైభవంగా అందుకున్నారు.
ఈ సందర్భంగా నీతి ఆయోగ్ వైస్ చైర్మన్, కేంద్ర కార్యదర్శి గారు మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాలలో విద్యా, వైద్యం, మౌలిక వసతుల కల్పనతో పాటు గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో పాడేరు ఐటీడీఏ నిరంతరం సాగిస్తున్న కృషిని, ప్రణాళికాబద్ధమైన విధివిధానాలను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రంలోని మిగిలిన ఐటీడీఏలకు పాడేరు ఒక ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు.

**సమిష్టి కృషికి దక్కిన గౌరవం, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి**

అవార్డు అందుకున్న అనంతరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ.. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. "ఈ అవార్డు పాడేరు ఐటీడీఏ పరిధిలోని అధికారులు, సిబ్బంది, మరియు క్షేత్రస్థాయి సిబ్బంది అందరి సమిష్టి కృషి, అంకితభావానికి దక్కిన గౌరవం అని పేర్కొన్నారు.
ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో, గిరిజన సంక్షేమమే ధ్యేయంగా రాబోయే రోజుల్లో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించేందుకు, గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి మరింత పట్టుదలతో పని చేస్తాం" అని పీఓ తెలిపారు .
రాష్ట్రంలోనే అత్యుత్తమ ఐటీడీఏగా నిలిచి, జాతీయ స్థాయి అధికారుల నుంచి అవార్డు అందుకోవడం పట్ల జిల్లా యంత్రాంగం, గిరిజన సంఘాలు మరియు ఐటీడీఏ సిబ్బంది ప్రాజెక్ట్ అధికారి వారికి, యావత్ బృందానికి ఘనంగా అభినందనలు తెలియజేస్తున్నారు.

## చంద్రబాబు హామీలకు రెండేళ్లు.. అమలు ఎక్కడ?

### సూపర్ సిక్స్ హామీల అమలుపై వైసీపీ నిరసన



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూన్ 4:** ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టో, సూపర్ సిక్స్ హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు -- నిరసన కార్యక్రమం"లో ఆయన మాట్లాడారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు, పాడేరు ఎమ్మెల్యే, అల్లూరి జిల్లా వైసీపీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో టీడీపీ--జనసేన--బీజేపీ కూటమి మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఆడబిడ్డ నిధి, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం, ఇంటింటికీ తాగునీటి కుళాయిలు, 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి, వాలంటీర్లకు రూ.10 వేల వేతనం తదితర హామీలు ఇచ్చిందని, వాటిలో అనేకం ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు.వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్నికల హామీలతో పాటు మేనిఫెస్టోలో లేని పలు సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలు చేశారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొర్ర రాజులమ్మ, మండల ఉపాధ్యక్షుడు వంతల అరుణ్‌కుమార్,నాయకులు వంతల చంటిబాబు,వనపల రాజేష్,లొంజా గణపతి,పాతూను లక్ష్మణ్, కొర్ర బాబి కొర్ర రాంబాబు, పొత్తురు గంగరాజు, కంకిపాటి శ్రీరాములు, సత్తిబాబు,గేమ్మెల కోటి బాబు, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## "సూపర్ సిక్స్ "పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం...!



- కూటమి రెండేళ్ల పాలన ప్రజలకు ఒరిగేది ఏమీ లేదు...!
- మేనిఫెస్టో పాంప్లేట్లను దగ్ధం చేసిన వైసీపీ నాయకులు

**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 4 :**కూటమి రెండేళ్ల పాలనలో ప్రజలకు చేకూరిన లబ్ధి ఏమీ లేదని, ప్రజా సంక్షేమాన్ని ఈ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, పాడేరు నియోజకవర్గ ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు పిలుపు మేరకు గురువారం కొయ్యూరు మండల కేంద్రంలో వైసీపీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందంటూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వం విడుదల చేసిన మేనిఫెస్టో పాంప్లేట్లను రోడ్డుపై పెట్టి బహిరంగంగా దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ బడుగు రమేష్ బాబు మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు అబద్ధపు, ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి కూటమి నాయకులు అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. అధికార పీఠం దక్కి రెండేళ్లు గడుస్తున్నా, ఆ హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అసమర్థ పాలన సాగుతోందని, ప్రజలు తమ హక్కుల కోసం రోడ్లపైకి వచ్చే పరిస్థితి తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేకనే నాటి ప్రతిపక్షాలు అబద్ధాలతో ప్రజలను వంచించాయని దుయ్యబట్టారు.
ఈ నిరసన కార్యక్రమంలో కొయ్యూరు మండల పార్టీ అధ్యక్షుడు బిడిజన అప్పారావు, మాజీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు, జిల్లా ఉపాధ్యక్షులు గాడి సత్యనారాయణ, రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ అచ్యుత్, రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కార్యదర్శి జైతి రాజులమ్మ, రాష్ట్ర ఆర్టీఐ విభాగం కార్యదర్శి నీలపు సూరిబాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పొట్టిక పోతురాజు, జిల్లా కార్యదర్శి సుమర్ల సూరిబాబు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ధోని బాబ్జి, జిల్లా గ్రీవెన్స్ సెల్ మాజీ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్,వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ,మండల పార్టీ ఉపాధ్యక్షుడు నర్సికృష్ణ,మండల కార్యదర్శులు వారా చిన నూకరాజు, కొర్రా తిరుపతి, సర్పంచ్ ఫోరం మాజీ అధ్యక్షులు రేగటి ముసలి నాయుడు,మాజీ సర్పంచులు రీమల శ్రీను,కోడా రాజబాబు, పాటి చంద్రశేఖర్, మాజీ ఉప సర్పంచ్ కాళ్ళ వనుంబాబు లతో పాటు నాయకులు, ధూపం శ్రీను,ఉల్లి రామ్మూర్తి, ధూరి గంగరాజు, కొర్రా నారాయణ,శివ వైసీపీ కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బోరుభద్ర పి హెచ్ సి స్టాఫ్ నర్స్ రాముకు మెమో

**టెక్కలి, పెన్ పవర్ జూన్ 4 :** సంతబొమ్మాళి మండలం బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్ గా పని చేస్తున్న పాలిన రాము విధి నిర్వహణలో అలసత్వం వహించడంతో మెమో ఇచ్చినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆవని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే సుమారు 20 మంది రోగులకు ఇంజక్షన్ వేసే సమయంలో ఒకపక్క సెల్ ఫోన్లో మాట్లాడుతూ ఇంజక్షన్ వేయడంతో చేతులకు వాపులు వచ్చాయి. దీనిపై స్టాఫ్ నర్స్ రామును బాధితులు నిలదీస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో బాధితులు అంతా ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి ఆర్థికంగా నష్టపోయారు. దీనిపై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆవనికి బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో స్టాఫ్ నర్స్ రాముకు మెమో ఇచ్చినట్లు డాక్టర్ తెలిపారు.

## కోటబొమ్మాళి లో వైసీపీ శ్రేణులు నిరసన కార్యక్రమం




**టెక్కలి, పెన్ పవర్ జూన్ 4 :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు టెక్కలి నియోజకవర్గ వైకాపా ఇంచార్జ్ పేరాడ తిలక్ అధ్యర్యంలో గురువారం కోటబొమ్మాళి లోని రైతు బజార్ కూడలి వద్ద " చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు " నిరసన కార్యక్రమం చేపట్టారు. రైతు బజార్ వద్ద ఉన్న రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పాలనను నిరసిస్తూ వైసీపీ శ్రేణులు నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను, టీడీపీ మేనిఫెస్టోను చించివేసి చెత్తబుట్టలో వేసి నిరసన తెలిపారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి నిరసనను అడ్డుకున్నారు.
ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చల్ల రవికుమార్ , మండల పార్టీ అధ్యక్షులు హేమసుందర్ రాజు , ఎంపిపి రోణంకి ఉమా మల్లయ్య , జెడ్పీటీసీ దుబ్బ వెంకటరావు , రాష్ట్ర పంచాయతీరాజ్ ఉపాధ్యక్షులు సత్యరాజ్ , వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిరిజనులకు సైబర్ నేరాలపై అవగాహన...!



ప్రజలతో మాట్లాడుతున్న మంప ఎస్సై సిదరి శ్రీనివాస్

**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 4 :**
మండలంలోని బూదరాళ్ల పంచాయితీ పరిధిలోని కునుకురు, వంతమర్రి గ్రామాల్లో మా పర్యటన -- అవగాహన సదస్సు నిర్వహణ మంప ఎస్సై శ్రీనివాస్ నిర్వహించారు.
గురువారం ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో కలిసి పలు గ్రామాలను పర్యటించారు.

**గ్రామాలపరిశీలన:**
గ్రామస్థులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకొని. గ్రామాల్లో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, అనుమానితులు కనిపిస్తే మాకు సమాచారం ఇవ్వాలని కోరారు .

**ప్రజలకు అవగాహన:**
అనంతరం గ్రామ ప్రజలకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రత (హెల్మెట్ ధరించడం), మహిళల రక్షణ, మరియు మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన కల్పించారు.
శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలంతా మాకు సహకరించాలని కోరారు.

# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు జనసేన సన్నద్ధం

ప్రజలే బలం.. ప్రజా సేవే ధ్యేయం: జనసేన నాయకులు

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూన్ 4:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా జనసేన పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర జానపద కళలు సృజనాత్మక అకాడమీ చైర్మన్, పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ వంపూరు గంగులయ్య ఆదేశాల మేరకు మండల కేంద్రంలో నిర్వహించిన జనసేన ముఖ్య నాయకుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు, అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గొర్లె వీరవెంకట్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పార్టీ బలోపేతం, గ్రామ స్థాయి కార్యాచరణ, ప్రజా సమస్యల పరిష్కారం, ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్థానిక ఎన్నికలు ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, పారదర్శక పరిపాలన, ప్రజా సంక్షేమం, సమస్యల పరిష్కారంలో జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని తెలిపారు. ప్రతి జనసైనికుడు ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.గిరిజన ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, విద్య, వైద్య రంగాల్లో ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, ప్రజా సేవా దృక్పథాన్ని ఆదర్శంగా తీసుకుని పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.రానున్న స్థానిక ఎన్నికల్లో జీకే వీధి మండలంలో జనసేన పార్టీ సత్తా చాటేలా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ వాసుపరి ప్రసాద్, పొత్తూరు విష్ణుమూర్తి, విరోజీ త్రిమూర్తులు, గడుతూరి పరమేష్, కొయ్యం ఇమ్మానుయేల్ సిద్దు, నాడేలా సత్యారావు, ఉల్లం ఈశ్వర్, వనపల ఈశ్వర్,మూర్తి, గబులంగి గణేష్,వంశీ, పాంగి శ్రీను, సాగిన బ్రహ్మాజీ పడాల్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## మురికికాల్వల్లో మంచినీటి బోర్లా అధికారులపై గంటా ఆగ్రహం



**భిమిలి, పెన్ పవర్, జూన్ 04 :** తగరపువలసలో నెలకొన్న డ్రైనేజీ, ట్రాఫిక్ సమ స్యలను భీమిలి ఎమ్మెల్యే గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మురికికాల్వల్లో బోర్లు తవ్వి నీటిని వినియోగిస్తున్న వారిపై తీవ్ర ఆగ్ర హం వ్యక్తం చేసిన ఆయన, బాధ్యులపై భారీ జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు.డ్రైనేజీ కాల్వల్లో మురుగు నీటి ప్రవాహానికి అడ్డంగా బోర్లు, మోటార్లు ఏర్పాటు చేసి వాటిని సంవత్సరాలుగా వినియోగిస్తున్న విషయాన్ని గమనించిన ఎమ్మెల్యే, కలుషిత నీటి వల్ల ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. ఈ వ్యవహారం పై కఠిన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిష నర్ ఎం. విజయ్‌కుమార్‌కు సూచించారు.

తగరపువలస జంక్షన్‌లో ప్రధాన రహదారిపై వ్యాపారాల కారణంగా ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యను కూడా ఆయన తీవ్రంగా పరిగణించా రు. త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో భీమిలి--తగరపువలస రహదారి ప్రాధాన్యం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు.అలాగే భీమిలి మెయిన్ రోడ్డు, నరసింహస్వామి ఆలయ రోడ్డు, బీచ్ రోడ్డు, గంటస్తంభం--బీచ్ రోడ్డు విస్తరణ ప్రతిపాదనలను తక్షణమే అమలు చేయాలని సూచించారు. భీమిలి అభివృద్ధి కోసం ,పి నారా యణ కేతన్ గార్ల తో కలిసి క్షేత్రస్థాయిలో పర్య టిస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం. విజ య్‌కుమార్, ఈఈ వెంకట వాసు, కూటమి నా యకులు గాడు చిన్ని కుమారి లక్ష్మి, తమ్మిన సూరిబాబు, దండి వెంకటేష్, గరే సదానంద, పరిమి భువనేశ్వరి, కొప్పల కృష్ణ, నీలాపు శంక ర్ రెడ్డి, దొంతల సూర్య తదితరులు పాల్గొన్నా రు.

## బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి...

- విలేజ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ డిమాండ్..



**చీపురుపల్లిపెన్ పవర్ జూన్ 4** :విజయనగరం జిల్లా.గరివిడి మండలం.చీపురుపల్లి ఆర్ఇసిఎస్ పరిధిలో ఏ పి ఈ పి డి సి ఎల్ పరిరక్షణలో పనిచేస్తున్న జె ఎల్ ఎమ్ ఎనర్జీ అసిస్టెంట్, విలేజ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ గా పని చస్తూ గురువారం నాడు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయిన గరివిడి మండలం బొండపల్లిల్ల గ్రామానికి చెందిన లోచర్ల సాయిబాబు కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఏపీ ఈపీడీసీఎల్ పరిధిలో పనిచేస్తున్న సుమారు 105 మంది ఉద్యోగులు గురువారం నాడు స్థానిక ఆర్ఇసిఎస్ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ప్రాణాలు తెగించి గ్రామాల్లో పని చేస్తున్న తమ కుటుంబాలకు భద్రత లేకుండా పోయిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సాయిబాబు కుటుంబానికి న్యాయం జరిగే వరకు తాము పోరాటం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. అదేవిధంగా నిరసన కార్యక్రమంలో భాగంగా విధులకు ఎవరు హాజరం కామంటూ తేల్చి చెప్పారు. ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని చనిపోయిన కుటుంబానికి భరోసా కల్పించడంతోపాటు పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు యూనియన్ ప్రెసిడెంట్ కొమరాపు శంకర్రావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

## హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో గిరిజన ఆస్తులు కోళ్లగొట్టే ప్రయత్నం చేస్తే సహిచం.



- హైడ్రో పోరాట కమిటీ కన్వీనర్ కృష్ణారావు
- హైడ్రో ప్రభావిత గ్రామం మజ్జివలసలో 13 గంటలు పాటు ఉత్కంఠ.
- సర్వే పేరుతో పునరావృతం ఐతే తీవ్రపరిణామాలు తప్పవు

**హుకుంపేట పెన్ పవర్ జూన్ 4:**అల్లూరి జిల్లా హుకుంపేట మండలం మజ్జివలస హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణ ప్రతిపాదిత గ్రామం మజ్జివలసలో నిన్న అనగా 3.6.2026న 11గంటలకు గ్రామానికి ప్రవేశించిన లాజికల్ సర్వే బృంధాం, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసంమీ సర్వే నిర్వహిస్తున్నారని,హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణ వ్యతిరేక పోరాటకమిటి ఆధ్వర్యంలో అర్ధరాత్రి 11; 30 గంటలవరకు నిర్బంధించారు.ఏ ఎస్పీ మిశ్రా ,సీఐ విజయ కుమార్ ఆందోళన కారులను నచ్చజెప్పే ప్రయత్నం చేసినా భారీ వర్షానికి సైతం లెక్కచేయకుండా అడ్డుకున్నారు.

కలక్టర్ వచ్చి సమాధానం చెప్పేవరకు వీళ్లని వదిలేసి లేదని భీష్మించి కూచున్నారు. జిల్లా కలెక్టర్ గ్రామానికి వచ్చి సమాధానం చెప్పాలని గ్రామస్తులు పట్టుపట్టరూ.జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ ప్రత్యేక చొరవతో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ ఐఏఎస్ ను గ్రామానికి తీసుకు వచ్చి సమాధానం చెపాటించడంతో ఎట్టకేలకు నిర్బంధించిన వారిని విడిచిపెట్టారు.ఈ కార్యక్రమానికి హాజరైన పోరాట కమిటీ కన్వీనర్, టి క్రిష్ణరావు, కో కన్వీనర్ ఎమ్ సురేష్ కుమార్ మాట్లాడుతూ,

నిత్యం ఎవరో ఒకరు గ్రామానికి వచ్చి సర్వేలు నిర్వహించి గ్రామస్తులకు తీవ్ర భయాందోళనలకు గురిచేస్తూనే ఉన్నారన్నారు.

వారిని అధికారులకు అప్పజెపితే వచ్చిన వారు ఎవరో మాకు తెలియదనీ చెప్పడం దురదృష్టకరం అన్నారు.

ఇది మరల పునరావృతం కాకుండా చూడాలని అన్నారు,మరల సర్వే పేరున ఎవ్వరు వచ్చినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమానికి గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## అక్రమంగా గంజాయి తరలింపు --పోలీసుల అదుపు ముగ్గురు



1.750 కిలోల గంజాయి స్వాధీనం చేసిన గోపాలపట్నం పోలీసులు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూన్ 4** : అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను గోపాలపట్నం పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 1.750 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్న నేపథ్యంలో నిర్వహించిన తనిఖీల్లో ఈ కేసు వెలుగులోకి వచ్చింది.

గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జూన్ 3వ తేదీన సింహాచలం రైల్వే క్వార్టర్స్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారి వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించారు. అరెస్ట్ అయిన వారిలో తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లాకు చెందిన డి.కార్తీక్, ఒక జువెనైల్ (మైనర్ బాలుడు), అలాగే ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లాకు చెందిన హృదయ కారా ఉన్నారు. వీరి వద్ద నుంచి మొత్తం 1.750 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా, జువెనైల్‌పై బాలల న్యాయ చట్టం ప్రకారం ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన ఇద్దరిపై సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు మరియు వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదకద్రవ్యాల కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం మరియు పోలీసు శాఖ చేపడుతున్న చర్యల్లో భాగంగా ఇలాంటి తనిఖీలు మరింత ముమ్మరం చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.


## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం

### సార్ పై క్షేత్రస్థాయి శ్రేణులకు ప్రభుత్వ విప్ గణబాబు దిశానిర్దేశం



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూన్ 4** : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా పని చేయాలని ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చేపట్టనున్న ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సార్) కార్యక్రమంపై గోపాలపట్నంలోని తన కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, వార్డు అధ్యక్షులు, బూత్ లెవెల్ ఏజెంట్లతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా క్షేత్రస్థాయిలో సమగ్రంగా పని చేయాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం కేవలం ఎన్నికల సంఘం బాధ్యత మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి రాజకీయ కార్యకర్తకు కూడా బాధ్యత ఉందన్నారు.

త్వరలో బూత్ లెవెల్ అధికారులు నిర్వహించనున్న ఇంటింటి సర్వే కార్యక్రమంలో పార్టీ శ్రేణులు చురుగ్గా పాల్గొని అవసరమైన సహకారం అందించాలని కోరారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ యువకులను గుర్తించి వారి పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేయించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే కొత్తగా నియోజకవర్గానికి వచ్చిన అర్హులైన వ్యక్తుల పేర్లు కూడా జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓటర్ల గుర్తింపు కార్డుల్లో పేర్లు, చిరునామాలు, వయస్సు వంటి వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే వాటిని సరిదిద్దే ప్రక్రియలో ప్రజలకు సహకరించాలని గణబాబు సూచించారు. అదే సమయంలో మరణించిన వ్యక్తుల పేర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు జాబితాలో కొనసాగకుండా అవసరమైన సమాచారం అందించాలని పేర్కొన్నారు. నకిలీ ఓట్ల నివారణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బూత్ లెవెల్ ఏజెంట్లు తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, స్థానిక క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను మరింత బలోపేతం చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, వార్డు అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, బూత్ లెవెల్ ఏజెంట్లు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమం అమలుపై చర్చించారు. రాబోయే రోజుల్లో ప్రతి బూత్ స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ఓటర్ల జాబితా సవరణను సమర్థవంతంగా నిర్వహించాలని నిర్ణయించారు.




## విద్యుత్ ఉద్యోగ మృతి...



**పెన్ పవర్ చీపురుపల్లి.** విజయనగరం జిల్లా గరివిడి మండలం బొండపల్లి గ్రామానికి చెందిన లోచర్ల సాయి అనే విలేజ్ విద్యుత్ ఉద్యోగి మృతి చెందాడు.

బుధవారం సాయంత్రం వీచిన గాలి వర్షాలకు బొండపల్లిలో కరెంట్ బ్రేక్ డౌన్ అయ్యింది.

బొండపల్లి గ్రామంలో విలేజ్ ఎలక్ట్రికల్ వర్కర్ గా పనిచేస్తున్న లోచర్ల సాయిబాబు బ్రేక్ డౌన్ వర్క్ లో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తువిద్యుత్ షాక్ తగిలింది.. వెంటనే రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.. అప్పటికే లోచర్ల సాయి మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు..

బొండ పల్లి గ్రామంలో20 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న డు..

మృతుడు స్థానిక బండపల్లి గ్రామ నివాసి కావడంతో బొండపల్లి గ్రామంలో విషాదశాలు అలుముకున్నాము..

మృతుడికి సాత్విక్ (7). అబ్బాయి. మరియు ( 5) లయ అమ్మాయి. మృతిచెందిన ఉద్యోగిని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కుటుంబ సభ్యులు మరియు గ్రామ ప్రజలు, సహ ఉద్యోగులు కోరుకుంటున్నారు.

## ఉమ్మడి విశాఖ డ్రైవర్ల సంఘం రద్దు

- తాత్కాలిక కమిటీ నియామకం
- రికార్డులు, ఆస్తులు అప్పగించాలని ఆదేశం



**విశాఖపట్నం, పెన్ పవర్ జూన్ 4 :**ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా కమిటీని తక్షణ ప్రభావంతో రద్దు చేస్తున్నట్లు ఏపీ గవర్నమెంట్ వెహికల్ డ్రైవర్స్ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. ప్రకాశరావు ప్రకటించారు. సంఘ రాజ్యాంగం కల్పించిన అధికారాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

సంఘ నిర్వహణ కోసం తాత్కాలిక కమిటీని నియమించగా, జూన్ 1 నుంచి ఆ కమిటీ బాధ్యతలు చేపట్టినట్లు వెల్లడించారు. రద్దైన కమిటీ వద్ద ఉన్న నగదు, బ్యాంకు ఖాతాలు, చెక్ పుస్తకాలు, రశీదు పుస్తకాలు, సభ్యత్వ రికార్డులు, ఇతర అధికారిక పత్రాలు మరియు సంఘ ఆస్తులను వెంటనే తాత్కాలిక కమిటీకి అప్పగించాలని ఆదేశించారు.

సంఘ అభివృద్ధి, పారదర్శకత మరియు సభ్యుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకాశరావు పేర్కొన్నారు. కొత్త కమిటీకి సభ్యులందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఎండాడలో స్మార్ట్ వెండర్ జోన్‌కు శంకుస్థాపన



**బిమిలి, పెన్ పవర్, జూన్ 04 :** ఎండాడ ఆర్ఆర్ఆర్ సెంటర్ సమీపంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న స్మార్ట్ వెండర్ జోన్‌కు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ లో ప్రారంభించిన వెండర్ జోన్ విధానం విజయ వంతం కావాలని ఆకాంక్షించారు.
వేగంగా అభి వృద్ధి చెందుతున్న ఎండాడ ప్రాంతంలో రోడ్ల పక్కన తోపుడు బళ్లపై వ్యాపారం చేస్తున్న వారి కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నా యని పేర్కొన్నారు. వ్యాపారుల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా రూ. 1.5 కోట్ల వ్యయంతో ఆధునిక కంటైనర్ వెండర్ జోన్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ వెండర్ జోన్‌లో 50 నుంచి 70 మంది వరకు వ్యాపారులకు స్థలాలు కేటాయించే అవకాశం ఉంటుందని చెప్పారు. వ్యాపారులు, వినియోగదారుల సౌకర్యార్థం టాయిలెట్లు, మంచినీటి సదుపాయం, విద్యుత్ లైటింగ్, సీటింగ్ ఏర్పాట్లు, చిన్నారుల ఆట స్థ లం, పార్కింగ్ వంటి వసతులతో పాటు సోలార్ పవర్ సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నట్లు వెల్లడించారు.
ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వి. అయ్య ప్ప నాయుడు, ఈఈ శాంతిరాజు, కూటమి నాయకులు చెట్టుపల్లి సన్యాసిరావు, లొడగల అప్పారావు, చెట్టుపల్లి గోపి, దొరబాబు, మంగా దేవి, రవికుమార్, సారిపల్లి శ్రీను, దేవి, నాగరా జు తదితరులు పాల్గొన్నారు.


# గణపతి శర్మకు సిష్టికర్ణాల" సంఘం నేతలు సన్మానం



**టెక్కలి, పెన్ పవర్ జూన్ 4 :** సత్కారం అందుకునే భాగ్యం అందరికీ రాదని అది ఏ ఒక్కరికో ప్రాప్తిస్తుందని "సిష్టికర్ణాల" సంఘం నేతలు అన్నారు. ఇటీవలే సింహాచలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ధర్మకర్తల మండలి లో సభ్యునిగా నియమించబడ్డ స్థానిక శ్రీ కొత్తమ్మ తల్లి దేవస్థానం ప్రధాన అర్చకులు సుసరాపు గణపతి శర్మ ను గురువారం కోటబొమ్మాలి లో సిస్టి కరణాల సంఘం నేతలు ఘనంగా సత్కరించారు. గణపతి శర్మ ఆధ్యాత్మిక పరంగా చేసిన సేవలు కొనియాడదగినవని, అటువంటి వ్యక్తి చేసిన సేవలు ఆయనకు గుర్తింపుని ఇచ్చాయని వారు స్పష్టం చేశారు. గణపతి శర్మ మరిన్ని శిఖరాలు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోకోటబొమ్మాళి కి చెందిన. పలువురు సిష్టికర్ణాల సంఘం నేతలు పాల్గొన్నారు.

# జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన గిరిజన మోర్చా నేత చల్లంగి అచ్యుత్

- గిరిజన సమస్యలపై జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూన్ 4:** జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ అంతర్ సింగ్ ఆర్యను గురువారం విజయవాడలో గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి చల్లంగి అచ్యుత్ మర్యాదపూర్వకంగా కలిసి గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వంచుల పంచాయతీకి సంబంధించిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి చర్చించారు. అదేవిధంగా సిరిబాల గ్రామంలో ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తైతే నాలుగు పంచాయతీల పరిధిలోని ప్రజలకు తక్షణ వైద్య సేవలు అందడంతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన ఆరోగ్య సదుపాయాలు లభిస్తాయని వివరించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, వైద్య సదుపాయాల విస్తరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చల్లంగి అచ్యుత్ జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కోరినట్లు తెలిపారు.

# సహజసిద్ధ కాఫీ సాగుతో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు

- అల్లూరి జిల్లాలో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం
- జిల్లా కలెక్టర్ నిషాంతి. టి




**పాడేరు, పెన్ పవర్,జూన్ 4:** రైతు సాధికార సంస్థ (=ఎూా), వ్యవసాయ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా దొకులురు వేదికగా "జిల్లా స్థాయి కాఫీ సహజ వ్యవసాయ సమన్వయ సమావేశం" ఘనంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్ నిషాంతి. టి.
ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఙూజచీఖీ) ప్రాజెక్టులో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.
గురువారం ఉదయం పాడేరు మండలం డోకూలూరు గ్రామంలో ఈ సమావేశంలో జిల్లా ఉన్నతాధికారులతో జిల్లా కలెక్టర్ నిషాంతి. టి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన ప్రాంతంలో పండే కాఫీకి ప్రపంచవ్యాప్తంగా విశేషమైన గుర్తింపు ఉందని కొనియాడారు. రసాయన ఎరువులు, పురుగుమందులు లేకుండా పూర్తిగా సహజ పద్ధతుల్లో పండించే ఈ కాఫీని అంతర్జాతీయ మార్కెట్‌లో నేచురల్ కాఫీ" (చీ్ఞబతీబ్శీ జశీటటవవ)
"ఆర్గానిక్ కాఫీ"బ్రాండ్‌గా బలంగా ప్రమోట్ చేయడమే మన ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.
అంతర్జాతీయ ప్రమాణాలు – సర్టిఫికేషన్:
వివిధ దేశాల మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ఎన్.పి.ఒ.పి (చీూఊూ) అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలను అందుకోవడానికి రైతులు సిద్ధం కావాలని, ఆ దిశగా తగిన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.
డిజిటల్ మార్కెటింగ్:
సాంప్రదాయ పద్ధతులతో పాటు ఆన్‌లైన్ వేదికల (ఇఅశ్రీఱఅవ ఎతీఱఅఅస్త్ర ూశ్రీక్ష్టశీఏం) ద్వారా కాఫీ విక్రయాలు జరిపి, రైతులకు మెరుగైన మద్దతు ధర లభించేలా చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల వినియోగంపై అధికారుల నుంచి వివరాలు సేకరించారు.
బయ్యర్ – సెల్లర్ సమావేశాలు (దీబఎవతీ-చావశ్రీశ్రీవతీ వీవవ్ం): మార్కెట్‌లో వ్యాపారుల అంచనాలు, కొనుగోలుదారుల అవసరాలను అర్థం చేసుకునేందుకు త్వరలోనే బయ్యర్–సెల్లర్ సమగ్ర సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.
శిక్షణ కార్యక్రమాలు:
కాఫీ సాగు, ప్రాసెసింగ్, నాణ్యతా ప్రమాణాలపై మరింత అవగాహన కల్పించేందుకు రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను (ఎతీఱఅఅఅస్త్రఎూతీశీస్త్రతీఱఎం) నిర్వహించనున్నట్లు వెల్లడించారు.
అందుకు అనుబంధ ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో (జశీఅజవతీస్త్రవఅఎవ) పనిచేసి, క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తి సహకారం అందించాలని, తద్వారా మన ప్రాంతపు కాఫీని ప్రపంచ స్థాయి బ్రాండ్‌గా నిలపాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో టి. బాబురావు నాయుడు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, =ఎూా, డిపిఎం భాస్కరరావు, జిల్లా వ్యవసాయ అధికారి నందు, పి డి ఆర్ డి ఏ వి. మురళి, పిడి ఏపీఎంఐపి రహీం, పిడిఐసిడిఎస్ ఝాన్సీరాంబాయ్ పాడల్, ఏపీ ఎఫ్ డి సి, బిఎంఎస్ అరకు వేలి పాడేరు చింతపల్లి డివిజన్ అధికారులు, ఎస్ఎఫ్ఓ స్పైస్ బోర్డు అధికారిని, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి హామీల అమలులో వైఫల్యమంటూ వైఎస్సార్సీపీ నిరసన



**బిమిలి, పెన్ పవర్, జూన్ 04 :** కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయ డంలో పూర్తిగా విఫలమైందని విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షు డు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. వైఎస్సార్సీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం నిర్వహించిన 'వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమంలో భాగంగా భీమిలి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు నిరసన ప్రదర్శనలు చేపట్టాయి. పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నాయకులు, కార్యకర్తలు భారీగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో ప్రతులను ప్రతీకాత్మకంగా దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన చిన్న శ్రీను, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా ఎన్నికల హామీల అమలులో విఫలమైందన్నారు. సంక్షేమ పథకా లలో కోతలు, నిరుద్యోగ సమస్యలు, రైతులు, మహిళలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బం దులపై ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపిం చారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రభుత్వం నాటకాలు ఆడుతోందని, ప్రజా సమస్యల పరి ష్కారం కోసం వైఎస్సార్సీపీ పోరాటం కొనసా గుతుందని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు తైనాల విజయకుమార్, సిరమ్మ, వివిధ వార్డుల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాన్ని సందర్శిన -కిచెన్ గార్డెన్ ప్రారంభించిన

**జిల్లా కలెక్టర్ నిషాంతి. టి**



**పాడేరు, పెన్ పవర్,జూన్ 04:** పాడేరు మండలం డోకులురు అంగన్‌వాడీ కేంద్రాన్ని (ూఔజ) జిల్లా కలెక్టర్ నిషాంతి. టి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె అంగన్వాడి కేంద్రంలోని పూర్వ ప్రాథమిక విద్య (ప్రీ–స్కూల్) పిల్లలతో సరదాగా గడుపుతూ, వారి చదువు, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులతో ముఖాముఖి మాట్లాడి, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న పౌష్టికాహారం, ఇతర సేవలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.
చిన్నారులకు పూర్తి రసాయన రహిత, స్వచ్ఛమైన పౌష్టికాహారాన్ని అందించాలనే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్ర ఆవరణలో ఏర్పాటు చేసిన "న్యూట్రీ–గార్డెన్" (కిచెన్ గార్డెన్)ను కలెక్టర్ ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ సమాజ ఆధారిత ప్రకృతి వ్యవసాయం (ఙూజచీఖీ) భాగస్వామ్యంతో, పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఈ కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేశారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు రసాయనాలు లేని స్వచ్ఛమైన ఆహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఙూజచీఖీ సహకారంతో అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఇలాంటి తోటలను పెంచడం ద్వారా చిన్నారులకు నిత్యం తాజా, పోషకాలతో కూడిన ఆకుకూరలు, కూరగాయలను అందించవచ్చని తెలిపారు.
ఈ కార్యక్రమంలో పిడి ఐసిడిఎస్ ఝాన్సీరాయ్ , సి డి పి ఓ శారద ,అంగన్‌వాడీ కార్యకర్త, అంగన్వాడి సిబ్బంది, ఙూజచీఖీ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# జిసిసి అధికారుల నిర్లక్ష్య నిర్వాకం...!




**గ్యాస్ ఓటిపిల పేరుతో సామాన్యులకు మెగా దగా...!**

**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 4:** జిసిసి అధికారుల నిర్లక్ష్య నిర్వాకం, సామాన్య గ్యాస్ వినియోగదారులకు శాపంగా మారింది. మండలంలో గత కొంతకాలంగా తీవ్ర గ్యాస్ కొరత ఏర్పడిన విషయం తెలిసిందే. అయితే యాదృచ్ఛికంగా ఏర్పడిన ఈ కొరత కాస్తా, అధికారుల నిర్లక్ష్యంతో సామాన్య గ్యాస్ వినియోగదారులకు మరింత కృత్రిమ కొరత ఏర్పడుతోంది. కొంతమంది పెద్దలకు, నేతలకు అతి సులువుగా లభ్యం అవుతున్న వంటగ్యాస్, సామాన్య వినియోగదారులకు మాత్రం అందని ద్రాక్షలా మారింది. రిజిస్టర్డ్ వినియోగదారులు కూడా ఓటిపిల పేరుతో అధికారులు చేస్తున్న లీలలకు బలైపోయి, వంటగ్యాస్ కు నోచుకోలేకపోతున్నారు. ముందుగా వంట గ్యాస్ కొరకు ఆన్లైన్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని చెబుతున్న అధికారులు, ఆ సమయానికి వినియోగదారులకు గ్యాస్ అందించకుండా, కొన్ని రోజులు తరువాత మండలానికి గ్యాస్ వ్యాన్ పంపి, ఆ సమయానికి ముందుగా బుక్ చేసుకున్న వినియోగదారుల ఓటీపీలు చెల్లవంటూ, వాటికి ఇప్పటికే డెలివరీ చేసేసామంటూ కొత్త కథలు చెబుతున్నారు. దీనితో బుకింగ్ చేసుకున్న వినియోగదారులు కూడా, అధికారుల సమాధానంతో అవాక్కై, గ్యాస్ ను అందుకోలేక పోతున్నారు. అయితే ఇదే సమయంలో కొంతమంది మోతుబరులకు మాత్రం వంట గ్యాసునాయాసంగా అందడం విచిత్రం. అసలు మండల కేంద్రంలో గ్యాస్ కూడా లేకనే, మండలానికి రావలసిన గ్యాస్ సరిపడా సరఫరా కాకుండా, చింతపల్లి లోనే పక్కదారి పడుతోందని వినియోగదారులు భావిస్తున్నారు. ఈ విషయమై స్థానిక నేతలు గాని, ప్రజా ప్రతినిధులు కానీ ఏమాత్రం పట్టించుకోకపోవడం మరిన్ని విమర్శలకు తావిస్తోంది.

# మెగా డీఎస్సీ పేరిట యువతను మోసం చేయొద్దు!

- కూటమి ప్రభుత్వ సూపర్ సిక్స్ ఎక్కడ?
- ఎన్నికల హామీలు వెంటనే అమలు చేయాలి.
- వైసిపి ముంచంగిపుట్టు మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు, వైసిపి నేతలు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 04.** మెగా డీఎస్సీ పేరిట యువతకు మోసం చేయొద్దని, సూపర్ సిక్స్ ఎక్కడని? నిరుద్యోగ యువత ఆశలతో కూటమి ప్రభుత్వం ఆడుకోవడం సరికాదని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఇప్పుడు ఎందుకు కనిపించడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ.. ముంచంగిపుట్టు మండల వైసీపీ అధ్యక్షుడు పాంగి పద్మారావు, వైసిపి నేతలు ఆందోళన చేపట్టారు. గురువారం మండల కేంద్రంలో వెన్నుపోటుకు రెండేళ్లు అనే కార్యక్రమం ద్వారా వైసిపి శ్రేణులు ప్రభుత్వం పై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పద్మారావు, వైసిపి నేతలు మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, యువత భవిష్యత్తుతో చెలగాట మాడుతున్న కూటమి ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. హామీలు అమలు చేసే వరకు వైసీపీ పోరాటం ఆగదని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే ప్రజల తీర్పుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా కోఆర్డినేటర్ జగబంధు, వైస్ ఎంపీపీ భాగ్యవతి, ఎంపిటిసిలు, మండల, పంచాయతీ అనుబంధ కమిటీ సభ్యులు, నిరుద్యోగ యువత, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జెడ్పి నిధులతో అంటబొంగులో సిసి రోడ్డు నిర్మాణం

- నిర్మాణ పనులను ప్రారంభించిన ఎంపీటీసీ కోడా నబ్బో, వైసీపీ నేత సీసా బాలరాజు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మే 04.** మండలంలో గల బరడ పంచాయతీ, అంటభోంగు గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు ఐదు లక్షలతో 100 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు బరడ పంచాయతీ ఎంపిటిసి కోడా నబ్బో, వైసీపీ నేత సీసా బాలరాజు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ.. గతంలో సర్పంచ్, ఎంపీటీసీలుగా తాము ఇచ్చినా హామీ మేరకు జడ్పీ చైర్మన్ నిధులతో 100 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. గ్రామంలో సిసి రోడ్డు లేక వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడేవారని, ఈ విషయం గ్రామస్తులు తమ దృష్టికి తీసుకురావడంతో సిసి రోడ్డు నిర్మాణానికి కృషి చేశామన్నారు. పంచాయతీనీ అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని వారు పేర్కొన్నారు. సిసి రోడ్డు నిర్మాణం చేపట్టడంతో జెడ్పి చైర్ పర్సన్, ఎంపిటిసి, మాజీ సర్పంచ్ లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ కోడా రోయిల, విక్రమ్, త్రినాథ్, నీలకంఠం, విఆర్పి రామారావు, పెసా ఉపాధ్యక్షులు, గ్రామ నాయుడు కోడా వెంకటరావు, గురు, గురుమూర్తి గ్రామ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మోసపూరిత పాలన ఇంకా ఎన్నాళ్ళు.. ప్రశ్నించిన వైసీపీ శ్రేణులు..




**చీపురుపల్లిపెన్ పవర్ జూన్ 4:** ఇచ్చిన హామీలను విస్మరించి మోసపూరిత పాలనను నడుపుతున్న కూటమి పాలకుల పాలన ఎన్నాళ్లు కొనసాగుతుంది వైసీపీ శ్రేణులు ప్రశ్నించారు. గురువారం నాడు చీపురుపల్లి పట్టణంలోని మూడురోడ్డుల జంక్షన్ లో వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో పాల్గొన్న యువనాయకుడు డాక్టర్ బొత్స సందీప్ బాబు ఆధ్వర్యంలో భారీగా నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వైసీపీ శ్రేణులు ప్రసంగిస్తూ
కూటమి ప్రభుత్వం రెండేళ్లుగా ఆడబిడ్డ నిధి డబ్బులు ఇవ్వకుండా మహిళలని, పెన్షన్ కోసం ఎదురు చూస్తున్న అవ్వా తాతలు,వితంతువులు, వికలాంగులను, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను మోసం చేస్తూ వస్తుంది,అందుకే వెన్నుపోటు కు రెండేళ్లు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుబొత్స సందీప్ తెలిపారు.సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం,డాక్టర్ బొత్స సందీప్ బాబు అన్నారు.
వెన్నుపోటుకు రెండేళ్లు"కూటమి వైఫల్యాలపై చీపురుపల్లి మండలశీ లో వైఎస్సార్సీపీ నిరసన గళం ప్రదర్శించారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు, శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ గ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు , మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆదేశాల మేరకు చేపట్టిన "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమం చేపట్టారు. గురువారం చీపురుపల్లి నియోజకవర్గంలోని చీపురుపల్లి పట్టణంలో మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు హోరెత్తాయి.?ఈ నిరసన కార్యక్రమాల్లో వైఎస్సార్సీపీ యువ నాయకురాలు డాక్టర్ బొత్స సందీప్, జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండలపార్టీ అధ్యక్షులు మీసాల వరహాలనాయుడు, యూత్ అధ్యక్షులు బెల్లన వంశీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు.?ఈ సందర్భంగా డాక్టర్ బొత్స సందీప్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఆశ చూపిన "సూపర్ సిక్స్" హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. యువత, మహిళలు, రైతులు మరియు సమాజంలోని అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేయడం వల్ల రాష్ట్ర ప్రజల్లో తీవ్ర నిరాశ, అసహనం నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన మాటను తప్పడం ద్వారా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని విమర్శించారు.ప్రజల సంక్షేమం కోసం, వారికి ఇచ్చిన హామీల అమలు కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని డాక్టర్ సందీప్ స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం ప్రకటించిన భవిష్యత్ కార్యాచరణను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని, ప్రజల పక్షాన నిలబడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.చీపురుపల్లి మెయిన్ రోడ్డు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాశీ నుంచి మూడురోడ్డుల జంక్షన్ వరకు వందలాదిగా ప్రజలు ర్యాలీ గా వెళ్లి కూటమి ప్రభుత్వం నశించాలి, సూపర్ సిక్స్ హామీలు వెంటనే అమలు చెయ్యాలి అని నినాదాలు హోరెతించారు .ఇదేమి రాజ్యశీ ఇదేమి రాజ్యం దోపిడీ రాజ్యం దొంగల రాజ్యం అంటూ యువత నినాథాలు మారు మొగయి. మూడురోడ్డుల జంక్షన్ లో ప్రజలు కార్యకర్తలు తెలుగుదేశం బుటకపు మేనిఫెస్టో కాపీ లను చించివేశారు.తెలుగుదేశంనాయకులుచంద్రబాబునాయుడు,జనసేననాయకులుపవన్కళ్యాణ్ ప్రజలకుఎన్నికలముందుసూపర్ సిక్స్ హామీలకు మాది పూచి అని ప్రతికుటుంబానికి బాండ్ మీద సంతకాలు చేసి ఇచ్చారు అని అన్నారు. సూపర్ సిక్స్ హామీలు ప్రజలకు పూర్తిగా అందే వరకు వైస్సార్ పార్టీ ప్రజల తరుపున నిరంతరం పోరాటం చేస్తుందిఅని ప్రజా గొంతుక వినిపిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైస్సార్ పార్టీ పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మీసాల వరహాలనాయుడు,యూత్ అధ్యక్షులు బెల్లానవంశీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ధన్నాన జనార్ధన,జిల్లా బీసీ ఉపాధ్యక్షులు బెల్లాన త్రినాధరావు, సచివాలయం అధ్యక్షులు పతివాడరాజారావు,రేవల్ల సత్తిబాబు, అధికారుల శ్రీను బాబు, రఘుమండ త్రినాథ్ చందక గురునాయుడు, బాణన శ్రీను, రమణ, పిసిని శ్రీను, గవిడి సురేష్, కర్రోతు ప్రసాద్, గవిడి కల్కి జీవన్,రౌతు పైడిరాజు, కంచుపల్లి అశోక్ తో పాటు పలువురు ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్లు, సంక్షేమ పథకాల బాధితులు మరియు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# వెన్నుపోటు ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం



- గడచిన రెండేళ్లలో ప్రజలపై మోయలేని భారం
- రాష్ట్రంలో అమలు కాని సూపర్ సిక్స్ హామీలు
- వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు జగ్గిరెడ్డి విమర్శ

**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 04;**రాష్ట్రంలో గత రెండేళ్లుగా చంద్రబాబు సర్కార్ కొనసాగిస్తున్న అసమర్థపాలన, అరాచకవాదం, వెన్నుపోటు రాజకీయాలకు చరమగీతం పాడి గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలయ్యే విధంగా వైఎస్సార్సీపీ రాజీలేని పోరాటం చేస్తుందని వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రాష్ట్ర వైఎస్సార్సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పిలుపు మేరకు ఆలమూరు బస్టాండు సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం జరిగింది. మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, మేధావులు, ప్రజా సంఘాల నేతలు వచ్చి వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమానికి సంఘీభావం పలికారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఏకరువు పెట్టారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టి రెండేళ్లు అవుతున్నా ఇప్పటి వరకూ ఒక కొత్త పింఛన్‌ను మంజూరు చేయలేదని విమర్శించారు. నిరుద్యోగ భృతి లేదని, అందించలేదన్నారు. పెట్రో ధరల పెంపుతో ప్రజలపై విపరీతమైన భారం పెరిగిందన్నారు. నిత్యవసరాలు, రవాణా చార్జీలు, గృహనిర్మాణ సామాగ్రి ధరలు భారీగా పెరిగిపోయి సామాన్యుడి నడ్డిని విరిచిందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇసుక, మట్టి, గ్రావెల్ వంటి పకృతి సంపదను అధికార పార్టీ నేతలు దోచుకుతింటున్నారన్నారు. ఆరోగ్యం, విద్య, ఉపాధి రంగాల్లో ప్రభుత్వ సాయం అందక విలవిలలాడిపోతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీలో అనర్హులకు ఉద్యోగాలిచ్చి నిరుద్యోగ యువతను మోసం చేసిన నైజం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దన్నారు. ఇక నుంచి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్సార్సీపీ ప్రజల పక్షాన పోరాడుతుందని మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి హెచ్చరించారు. బూటకపు హామీలతో గద్దెనెక్కి ప్రజలను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు వాగ్దాన సూపర్ సిక్స్ పోస్టర్లను పార్టీ శ్రేణులతో కలిసి ఆయన దహనం చేశారు. అనంతరం ప్రభుత్వ వైఫల్యాలు, ప్రభుత్వ దమన కాండను నిరసిస్తూ సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని కోరుతూ బారీ ర్యాలీ నిర్వహించారు.నియోజకవర్గ పార్టీ పరిశీలకులు పి. శివకుమార్, వైఎస్సార్సీపీ నేతలు చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, నియోజకవర్గ బూత్ కమిటీ మేనేజర్ నామాల శ్రీనివాసు, రాష్ట్ర వైఎస్సార్సీపీ పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి నెక్కంటి వెంకట్రాయుడు, రాష్ట్ర మేధావుల ఫోరం కార్యదర్శి కె.హరిష్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, నల్లి రాజు, చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, గుణ్ణం రాంబాబు, వనుం సూరిబాబు, నాంద్ర నాగమోహన్‌రెడ్డి, తోరాటి గోవిందు, చామకూరి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

# మండల వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అభిమాన నేతలకు ఘన సత్కారం

**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 04;**ఆలమూరులోని బస్టాండు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద గురువారం జరిగిన వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమానికి విచ్చేసిన అభిమాన నేతలకు ఘన సత్కారం జరిగింది. మండల వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు పి.శివకుమార్‌ను పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పూలమాలలు వేసి దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ఆదేశాల మేరకు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాన్ని మండుటెండను



# అపెక్స్ ఫ్యాక్టరీలో మహిళా రక్షణ చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



పెద్దాపురం, పెన్ పవర్,జూన్ 4: కాకినాడ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పెద్దాపురంలోని అపెక్స్ ఫ్యాక్టరీలో మహిళా కార్మికులకు మహిళా రక్షణ చట్టాలు, పోక్సో చట్టం, శక్తి యాప్, సైబర్ నేరాలు మరియు రోడ్డు భద్రత అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్దాపురం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఏ.బి.జి. తిలక్ ముఖ్య వక్తగా పాల్గొని మహిళా భద్రతకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తమ భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన శక్తి యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 అత్యవసర సేవలు లేదా శక్తి యాప్ ద్వారా వెంటనే పోలీసులను సంప్రదించవచ్చని తెలిపారు.ప్రస్తుతం సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో అపరిచితుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వివిధ రకాల సైబర్ మోసాలపై అవగాహన పెంపొందించుకుని మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.అలాగే ఫ్యాక్టరీకి వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా పర్యవేక్షించాలని పేర్కొన్నారు.
హాస్టళ్లలో నివసిస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళా కార్మికులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని, వారి పూర్తి వివరాలు, కుటుంబ సభ్యుల సంప్రదింపు సమాచారం యాజమాన్యం భద్రపరచాలని సూచించారు. ఇతర రాష్ట్రాలకు ప్రయాణించే సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు.మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఎస్ఐ మౌనిక,సీఐ వై.ఆర్.కె.,పోలీసు సిబ్బంది,ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రతినిధులు మరియు మహిళా కార్మికులు పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్తు శిక్షణా తరగతుల్లో పాల్గొనండి



**టెక్కలి, పెన్ పవర్ జూన్ 4 :** ఈ నెల 13 14 తేదీల్లో శ్రీకాకుళం లోని కాలభైరవ పీఠంలో జరగనున్న విశ్వహిందూ పరిషత్ శిక్షణా తరగతులలో హిందువులంతా పాల్గొనాలని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సంతబొమ్మాలి మండలం మలగాం,ఆర్ హెచ్ పురం, బోరుభద్ర పంచాయతీ గ్రామాల్లో గురువారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.
ఈ ప్రచార కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షులు రట్టి పెరుమాల్లు ,సత్సంగ ప్రముఖులు లక్ష్మీనారాయణ, పురోహితులు శీను స్వామి ప్రఖండ కార్యదర్శి గణపతి స్వామి, సహాయ కార్యదర్శి ఎన్ని రాము, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


## నందిగాం లో ' చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు " నిరసన కార్యక్రమం

అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులు..



**టెక్కలి, పెన్ పవర్ జూన్ 4 :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు టెక్కలి నియోజకవర్గం వైకాపా ఇంచార్జ్ పేరాడ తిలక్ అధ్యర్యంలో గురువారం
నందిగాంలో వైసీపీ శ్రేణులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. నందిగాం రైతు బజార్ నుండి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ గా వెళ్లి " చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు " నిరసన కార్యక్రమం చేపట్టారు. చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పాలనను నిరసిస్తూ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను, టీడీపీ మేనిఫెస్టోను చించివేసి చెత్తబుట్టలో వేసి నిరసన తెలిపారు. పెద్ద ఎత్తున పోలీసులు మోహరించి నిరసన కారక్రమాన్ని అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఏఎన్ఎం మృతి.



**చింతపల్లి పెన్ పవర్ జూన్ 4.**
అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో ఏఎన్ఎమ్ గా పనిచేస్తున్న అడికటియ లీలావతి (46) అనారోగ్యంతో మృతి చెందారు. చింతపల్లి మండలం తాజంగి గ్రామపంచాయతీ కేంద్రంలో నివాసముంటున్న లీలావతి గురుకుల పాఠశాలలో సుమారు 15 ఏళ్లుగా ఏఎన్ఎం గా విధులు నిర్వహిస్తున్నారు. కాకరపాడు, పెదబయలు, చింతపల్లి పాఠశాలలలో ఆమె సేవలను అందించారు. ఆమె కిడ్నీ సంబంధిత వ్యాధితో 20 రోజులుగా బాధపడుతూ కేజీహెచ్ లో చికిత్స పొందుతున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బుధవారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఆమె పార్థీవదేహానికి చాజంగులు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలికి భర్త ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఏఎన్ఎం మృతిపై పెదబయలు గురుకుల కళాశాల ప్రిన్సిపల్ శంకర్రావు, చింతపల్లి గురుకుల కళాశాల ప్రిన్సిపల్ రామేశ్వరం , దారిన మాజీ సర్పంచ్ టిడిపి నాయకుడు పాండురంగ స్వామి నాయకులు తిరుపతిరావు ఆనందరావు లంబసింగి వీఆర్వో సదానంద రావు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఉండాల్సిన రాయితీలు సకాలంలో అందించేందుకు కృషి చేస్తామని గురుకుల కళాశాల అధికారులు తెలిపారు.

## ప్రజాస్వామ్యం గెలిచిన రోజు -- ఘనంగా "ప్రజా తీర్పు" విజయోత్సవం



**రామచంద్రపురం, పెన్ పవర్ జూన్ 4:** రామచంద్రపురం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా తీర్పు దినోత్సవాన్ని పురస్కరించుకుని కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకొని ప్రజాస్వామ్య విజయాన్ని స్మరించుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, రెండేళ్ల క్రితం ఇదే రోజున ఆంధ్రప్రదేశ్ ప్రజలు విధ్వంసకర పాలనకు ముగింపు పలికి ప్రజాస్వామ్యానికి పట్టం కట్టారని అన్నారు. ప్రజల ఆకాంక్షలు, అభివృద్ధి పట్ల ఉన్న ఆశయాలు విజయాన్ని సాధించిన చారిత్రాత్మక రోజు ఇదని పేర్కొన్నారు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి దెబ్బతిందని విమర్శించిన ఆయన, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమరావతి రాజధాని నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు.ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న ప్రభుత్వాన్ని చూసి ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నాయని ఆయన ఆరోపించారు. సీఎం చంద్రబాబు నాయుడు పరిపాలనా అనుభవం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్ర పునర్నిర్మాణానికి బలమైన పునాది పడిందని పేర్కొన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ జనరంజక పాలన అందిస్తున్నారని కొనియాడారు. ప్రజలు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు ప్రభుత్వ బాధ్యతను మరింత పెంచిందని, రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి కొనసాగిస్తామని వాసంశెట్టి సత్యం తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఉండవెల్లి శివ,కూటమి పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గొల్లప్రోలులో అక్రమ గోమాంసం తరలింపు భగ్నం.

- 100 కిలోల మాంసం స్వాధీనం



**కాకినాడ బ్యూరో (గొల్లప్రోలు) పెన్ పవర్, జూన్, 4:**గొల్లప్రోలు మండలంలో అక్రమంగా తరలిస్తున్న గోమాంసాన్ని పోలీసులు గురువారం ఉదయం పట్టుకున్నారు. గొల్లప్రోలు టోల్ ప్లాజా సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా వచ్చిన ఒక టాటా ఏస్ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సుమారు 100 కిలోల అక్రమ గోమాంసం తరలిస్తున్నట్లు గుర్తించి, దానిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి వాహన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా మాంసం సరఫరాకు సంబంధించిన కీలక విషయాలు వెల్లడయ్యాయి. ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న మరికొందరిని గుర్తించిన పోలీసులు,డ్రైవర్‌తో పాటు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న 100 కిలోల గోమాంసాన్ని రెవెన్యూ అధికారుల సమక్షంలో నిబంధనల ప్రకారం నిర్వీర్యం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

## చదవడం మాకిష్టం, పుస్తకాలే మా నేస్తం అంటూ విద్యార్థుల ర్యాలీ.

- వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయాల పట్ల అవగాహన.






**ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 4:** పట్టణంలో దిబ్బల పాలెం కాలేజీ రోడ్లో గల జిల్లా శాఖ గ్రంధాలయంలో గత ఏప్రిల్ 28 నుంచి ప్రతిరోజూ విద్యార్థులకు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నారు. గ్రంథ పాలకుడు కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులు చదవడం మాకిష్టం, పుస్తకాలే మా నేస్తం అంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ తరగతుల్లో విశ్రాంత ఉపాధ్యాయుడు మామిడి రాము విద్యార్థుల చేత కథలు చదివించి, రాయడం నేర్పించారు. ఈ సందర్భంగా రామ మాస్టర్ మాట్లాడుతూ తెలుగు భాషకు గుండ్రని లిపి ఉందని, ప్రతి విద్యార్థి మాతృభాష పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. నిరంతరం రాయడం వల్ల దస్తూరి మెరుగుపడడంతో పాటు జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందని విద్యార్థులకు వివరించారు. ఈ వేసవిజ్ఞాన తరగతుల్లో గ్రంథాలయాల పట్ల ఆసక్తి పెంచే విధంగా గ్రంథాలయాల ప్రాముఖ్యత, ఉన్నత తరగతుల్లో గ్రంథాలయాలు ఏ విధంగా ఉపయోగపడతాయో రాము మాస్టర్ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, 25 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# తర్లంపూడి గ్రామ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### గ్రామసభలో తహసీల్దార్, ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసిన ఏపీ కౌలు రైతుల సంఘం

**కాజులూరు, పెన్ పవర్,జూన్ 4:** కాజులూరు మండలం తర్లంపూడి గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ కౌలు రైతుల సంఘం, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో అధికారుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్లారు.ఈ సందర్భంగా ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వల్లు రాజబాబు, నాయకులు ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామంలో తీవ్రంగా ఉన్న మంచినీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని, మురుగు కాలువలు నిర్మించాలని, స్మశాన వాటికలో షెడ్డు ఏర్పాటు చేయాలని కోరారు.అలాగే గ్రామంలో నెలకొన్న లో-వోల్టేజ్ సమస్యను పరిష్కరించడంతో పాటు ఉపాధి హామీ కూలీల సమస్యలను తీర్చాలని డిమాండ్ చేశారు.కౌలు రైతులకు భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని,వ్యవసాయానికి అవసరమైన ఎరువులు,పురుగుమందుల ధరలను తగ్గించాలని కోరుతూ ప్రజల సమక్షంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యలపై స్పందించిన తహసీల్దార్ జి. రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, ప్రధాన సమస్యలను పది రోజుల్లో పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వీరబోయిన త్రిమూర్తులు,చొల్లంగి చిన్న అప్పారావు, పెంకే వీరవెంకటరమణ,గుత్తుల పెంటయ్య,పిల్లి సూర్యనారాయణ, వీరబోయిన మాసరమ్మ,వీరబోయిన నూకాలమ్మ,గుత్తుల వెంకటలక్ష్మి,పెంకే లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ శ్రామికుడు చక్రధరరావు మృతి ఆ కుటుంబానికి ఎంతో తీరని లోటు.

-ప్రత్తిపాడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉమ్మడి వెంకట్రావు



కిర్లంపూడి/పెన్ పవర్, జూన్ 4: ప్రత్తిపాడు మండలం లంపకలోవ గ్రామానికి చెందిన ఉపాధి శ్రామికుడు లింగంపల్లి చక్రధరరావు మృతి ఆ కుటుంబానికి ఎంతో తీరనిలోటని ప్రత్తిపాడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఉమ్మడి వెంకట్రావు అన్నారు. లింగంపల్లి చక్రధరరావు బుధవారం గ్రామంలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తుండగా వడదెబ్బకు గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి వెంకట్రావు గురువారం లింగంపల్లి చక్రధరరావు కుటుంబాన్ని పరామర్శించి తన తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగంపల్లి చక్రధరరావు మృతి ఆ కుటుంబానికి ఎంతో తీరని లోటని, ప్రభుత్వం ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. చక్రధర్ రావు కుటుంబీకులను పరామర్శించిన వారిలో పిసిసి సభ్యులు.ధరణాలకోట శ్రీను, కొప్పున కోటేశ్వరావు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు మరింత మెరుగుపర్చాలి

- సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి -- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్
- ద్వితీయ శ్రేణి ఆసుపత్రుల పనితీరుపై సమీక్ష సమావేశం



**కాకినాడ, పెన్ పవర్,జూన్ 4:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చడంతో పాటు ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి డాక్టర్ కె. మహేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో జిల్లాలోని ద్వితీయ శ్రేణి ఆసుపత్రుల (సెకండరీ హెల్త్ హాస్పిటల్స్) పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో జనరల్ సర్జరీ, ఆఫ్తాల్మాలజీ (కంటి వైద్యం), ఈఎన్‌టీ సేవలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గర్భిణీ స్త్రీలను సాధారణ ప్రసవాల వైపు ప్రోత్సహించాలని, సిజేరియన్ ప్రసవాల శాతం 30 శాతానికి మించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గర్భధారణ ప్రారంభ దశ నుంచే మహిళలకు సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. తక్కువ బరువుతో జన్మించే శిశువుల సంఖ్యను తగ్గించేందుకు గర్భిణీల ఆరోగ్య పరిస్థితులను, ముఖ్యంగా వారి బరువును నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.అవసరమైన గర్భిణీ స్త్రీలకు టీఐఎఫ్ఎఫ్ఏ (టిఫ్ఫా) స్కాన్ నిర్వహణ కోసం కాకినాడ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి (జీజీహెచ్) లేదా తుని ప్రాంతీయ ఆసుపత్రికి రిఫర్ చేయాలని ఆదేశించారు.ఆసుపత్రుల్లో వైద్యుల కొరతను దృష్టిలో ఉంచుకుని, ఒక నెలలోపు కాంట్రాక్ట్ ప్రాతిపదికన వైద్యులను నియమించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంపొందించేందుకు వైద్యులు ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల వరకు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. రోగుల నుండి ఎటువంటి నగదు వసూలు చేయరాదని, బయట మందులు కొనుగోలు చేయాలని సూచించరాదని స్పష్టం చేశారు. అలాగే ఆసుపత్రులలో పారిశుద్ధ్యం, పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లాలోని 10 ద్వితీయ శ్రేణి ఆసుపత్రుల వైద్యాధికారులు, సంబంధిత శాఖల అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

## ఎన్ఎఫ్ఎస్ఎఫ్, ఫార్మర్ ఐడీపై అవగాహన సదస్సు




- ఎరువుల పంపిణీలో పారదర్శకత, రైతు కేంద్రిత సేవలే లక్ష్యం
- కాకినాడ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఎన్ఎఫ్ఎస్ఎఫ్ అమలు

**కాకినాడ, పెన్ పవర్,జూన్ 4:** ఎరువుల పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, వ్యవస్థీకృతంగా, రైతు కేంద్రితంగా మరియు డిమాండ్ ఆధారితంగా మార్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న జాతీయ ఎరువుల అమ్మకాల ఫ్రేమ్‌వర్క్ (నేషనల్ ఫెర్టిలైజర్ సేల్స్ ఫ్రేమ్‌వర్క్ –) మరియు ఫార్మర్ ఐడీ అంశాలపై గురువారం కాకినాడలోని కృషి భవన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు.భారత ప్రభుత్వ ఎరువుల శాఖ, వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖలు సంయుక్తంగా అభివృద్ధి చేస్తున్న ఎన్ఎఫ్ఎస్ఎఫ్ వ్యవస్థపై జిల్లా స్థాయి వ్యవసాయ అధికారులకు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి, ఎరువుల డీలర్లకు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గుంటూరు వ్యవసాయ కమిషనరేట్‌కు చెందిన మాస్టర్ ట్రైనర్ కె.జె.డి. రాజన్ పాల్గొని నూతన ఎన్ఎఫ్ఎస్ఎఫ్ వ్యవస్థ నిర్మాణం, అమలు విధానం, రైతుల నమోదు ప్రక్రియ, ఎరువుల ప్రీ-బుకింగ్ విధానం, ఎరువుల పంపిణీలో డీలర్ల బాధ్యతలపై వివరంగా వివరించారు.

ఎన్ఎఫ్ఎస్ఎఫ్ విధానంలో రైతులు లేదా వారి అధీకృత ప్రతినిధులు మొబైల్ అప్లికేషన్ ద్వారా నమోదు చేసుకుని భూమి, పంటల వివరాలను నమోదు చేయవచ్చని తెలిపారు. అనంతరం అవసరమైన ఎరువుల కోసం ముందస్తుగా బుకింగ్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.బుకింగ్ పూర్తయిన తర్వాత రైతులకు క్యూ ఆర్ కోడ్ ఆధారిత టోకెన్ జారీ చేయబడుతుందని, ఎరువుల డీలర్లు తమ పాయింట్ ఆఫ్ సేల్ యంత్రాల ద్వారా ఆ క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధృవీకరణ అనంతరం ఎరువులను రైతులకు పంపిణీ చేస్తారని వివరించారు.సదస్సులో ఫార్మర్ ఐడీ సృష్టి కార్యక్రమంపై కూడా ప్రత్యేక అవగాహన కల్పించారు. రైతుల నమోదు ప్రక్రియ, ఫార్మర్ ఐడీ ప్రాధాన్యత, భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు మరియు సేవలను మరింత సమర్థవంతంగా అందించడంలో ఫార్మర్ ఐడీ ఉపయోగకరత గురించి వివరించారు. జిల్లాలోని ప్రతి అర్హ రైతు ఫార్మర్ ఐడీ నమోదు పూర్తి చేసుకోవాల్సిన అవసరాన్ని అధికారులు నొక్కిచెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి ఎన్. విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాకినాడ జిల్లాను ఎన్ఎఫ్ఎస్ఎఫ్ అమలుకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జిల్లాకు గౌరవకరమైన విషయమని పేర్కొన్నారు. రైతులకు ఎరువుల సరఫరా మరింత సులభతరం, పారదర్శకంగా జరిగేలా ప్రభుత్వం తీసుకొస్తున్న ఈ నూతన విధానాన్ని విజయవంతంగా అమలు చేయడంలో వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ఎరువుల డీలర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అలాగే జిల్లాలో ఫార్మర్ ఐడీ నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి రైతుకు ఫార్మర్ ఐడీ సృష్టి పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన వ్యవసాయ సహాయ సంచాలకులు , మండల వ్యవసాయ అధికారులు , రైతు సేవా కేంద్రాల వ్యవసాయ అసిస్టెంట్లు, ఎరువుల డీలర్లు హాజరయ్యారు. సమావేశంలో నూతన వ్యవస్థ అమలుకు సంబంధించిన పలు అంశాలపై అధికారులు, డీలర్లు చర్చించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.రైతులకు నాణ్యమైన సేవలు, సమయానుకూల ఎరువుల సరఫరా, పారదర్శక పంపిణీ విధానాన్ని అందించడంలో ఎన్ఎఫ్ఎస్ఎఫ్ కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com